

నేడు మంత్రి లోకేశ్ రాక?



విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్ శనివారం సాయంత్రం విశాఖపట్నం వస్తున్నారు. వుడా పార్కు వెనుకనున్న ఏఎంజీ పార్కులో జరగనున్న ఓ వివాహానికి ఆయన హాజరు కానున్నట్టు సమాచారం. అనంతరం తిరిగి విజయవాడ వెళ్లిపోతారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

కార్తీక పూజలు



కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం ఎంవీపీ కాలనీ ముక్తేశ్వరాలయంలో శివలింగాలకు అభిషేకాలు చేస్తున్న భక్తులు

భక్తి శ్రద్ధలతో జ్వాలా తోరణం



కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. సాయంత్రం జ్వాలా తోరణ మహోత్సవాలు నిర్వహించారు. కొత్త వేంకోజీపాలెం జ్ఞాన లింగేశ్వరాలయంలో జ్వాలా తోరణం వెలిగించి, స్వామిని తోరణం కింద నుంచి ముమ్మార్లు అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు తిప్పారు. భక్తులు భారీగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. - 8వ పేజీలో

వరాహ పుష్కరిణికి నదీ హారతి



కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని దేవదాయ శాఖ ఆదేశాల మేరకు సింహాచలం వరాహ పుష్కరిణికి పండితులు శుక్రవారం సాయంత్రం నదీ హారతి ఇచ్చారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి, పుష్కరిణి ఒడ్డున దీపాలు వెలిగించారు. - 8లో

ఎమ్మెల్యేల లిక్కర్ దందా!

మద్యం వ్యాపారులకు ఇండెంట్లు

- దుకాణాల్లో వాటా అడుగుతున్న ఒక ఎమ్మెల్యే
- దుకాణానికి రూ.పది లక్షలు గుడ్ విల్ ఇవ్వాలని మరో ప్రజా ప్రతినిధి డిమాండ్
- తనను కలవని వారికి లైసెన్స్ ఇవ్వొద్దని ఎక్సైజ్ అధికారులకు మరో ఎమ్మెల్యే ఆదేశాలు
- లాటరీలో దక్కించుకున్న వారి వద్ద నుంచి మూడు దుకాణాలు చేజిక్కించుకున్న మరో ఎమ్మెల్యే
- ఆ దుకాణాల పరిసరాల్లో మరే దుకాణానికి లైసెన్స్ ఇవ్వకుండా మోకాలడ్డు
- నిబంధనలకు విరుద్ధంగా కొన్నిచోట్ల దుకాణాలు ఏర్పాటు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మద్యం వ్యాపారంలో కొంతమంది ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకుంటున్నారు. దుకాణాల్లో వాటా ఒకరు డిమాండ్ చేస్తే, మరొకరు... ప్రతి దుకాణం నుంచి గుడ్‌విల్ పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. బినామీ పేర్లతో తాము దక్కించుకున్న దుకాణాల పరిసరాల్లో మరొక దుకాణం ఏర్పాటుకాకుండా ఇంకొందరు అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు.



బాలయ్యశాస్త్రిలేఅవుట్‌లో రెసిడెన్షియల్ భవనంలో మద్యం దుకాణం ఏర్పాటుకి పనులు... ఫుట్‌పాత్‌ను ఆక్రమించి మెట్లు నిర్మాణం

మద్యం వ్యాపారంలో ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకోవద్దని సీఎం చంద్రబాబునాయుడు స్పష్టంగా ఆదేశించినా ఉమ్మడి జిల్లాలో కొంతమంది పెడచెవిన పెడుతున్నారు. తాము ప్రత్యక్షంగా సీన్‌లోకి రాకుండా తమ అనుచరులు, ఎక్సైజ్ శాఖలోని అస్మదీయులైన అధికారుల ద్వారా చక్రం తిప్పుతున్నారు. అనకాపల్లి జిల్లా పరిధిలోని ఒక ప్రజా ప్రతినిధి తన నియోజకవర్గంలో ఉన్న మద్యం దుకాణాల నుంచి గుడ్‌విల్ కింద కొంత మొత్తం వసూలు చేయాలంటూ అనుచరుడి ద్వారా ఎక్సైజ్ అధికారికి ఇండెంట్ పెట్టించారు. ఎక్సైజ్ శాఖ అధికారులు నియోజకవర్గంలోని ఒక్కో దుకాణం నుంచి రూ.పది లక్షలు చొప్పున వసూలు చేసి ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. రెండు రోజుల కిందట జరిగిన ఎక్సైజ్ శాఖ సమావేశంలో ఈ విషయాన్ని ఉన్నతాధికారులు సంబంధిత నియోజకవర్గంలో పనిచేస్తున్న ఎక్సైజ్ సీఐలకు వివరించినట్టు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో వ్యాపారులను పిలిచి ఉన్నతాధికారుల ప్రతిపాదనను వారికి వివరించాలని సీఐలు భావిస్తున్నారు. అనకాపల్లి జిల్లాలోని మరో నియోజకవర్గంలో ప్రజా ప్రతినిధి మద్యం వ్యాపారంలో స్లీపింగ్ పార్టనర్‌గా చేరాలనే ఉద్దేశంతో ఉన్నారు. ప్రతి దుకాణంలో తనకు వాటా ఇవ్వాలని, ఆ మేరకు లైసెన్స్ ఫీజును ఇచ్చేస్తానని వ్యాపారులకు ప్రతిపాదించినట్టు ప్రచారం జరుగుతోంది. గుడ్‌విల్, అధికారులకు ఇచ్చే ఫార్మాలిటీలను తాను ఇచ్చుకోలేనని కేవలం లైసెన్స్ ఫీజులో వాటాను మాత్రమే చెల్లిస్తానని చెప్పడంతో వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. మరొక ప్రజా ప్రతినిధి తన నియోజకవర్గంలో నోటిపై చేసిన దుకాణాలకు లైసెన్స్‌లను జారీచేసేముందు తన దృష్టిలో పెట్టాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు ఆదేశించినట్టు ప్రచారం జరుగుతోంది. తనను కలిసి ప్రసన్నం చేసుకున్న వారికి మాత్రమే లైసెన్స్‌లు జారీచేయాలని అధికారులకు సూచిస్తున్నారని, కలవని వారికి దుకాణాలు దొరకకుండా చేయడంతోపాటు ఎక్కడైనా ఏర్పాటుచేసుకున్నాసరే లైసెన్స్ జారీ కాకుండా ఇబ్బందిపెడుతున్నారని కొంతమంది వ్యాపారులు చెబుతున్నారు. సదరు ప్రజా ప్రతినిధి ఇబ్బంది పడలేకే రూ.ఐదు ... మిగతా 6వ పేజీలో

అనధికార లేఅవుట్లకు చెక్

కట్టడి కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్

- వీఎంఆర్‌డీఏ నిర్ణయం
- ఒడిశా విధానం అమలు
- అనుమతులు లేకుండా లేఅవుట్ వేస్తే వెంటనే చర్యలు
- ఒక జేసీబీ, 24 బృందాలు సిద్ధం
- ఇప్పటికే ఉన్న అనధికార లేఅవుట్ల వివరాలు వెబ్‌సైట్‌లో పెట్టిన అధికారులు
- వాటిల్లో ప్లాట్లు కొనొద్దని సూచన



సబ్బవరం మండలంలో అనధికార లేఅవుట్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి విశాఖ జిల్లాలో అనధికార లేఅవుట్లు లెక్కకు మించి వెలుస్తున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం లాభదాయకంగా ఉండడంతో వ్యాపారులు వ్యవసాయ భూములు కొని లేఅవుట్లుగా మారుస్తున్నారు. వీటిలో అత్యధికం అనుమతులు లేనివి ఉంటున్నాయి. దీనివల్ల కొనుగోలుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ సంస్థలు ఆదాయం కోల్పోతున్నాయి. వీటిని కట్టడి చేయడానికి విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) కొత్తగా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. ఒడిశాలో అనుసరిస్తున్న విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వ పెద్దలకు వీఎంఆర్‌డీఏ ప్రతిపాదించింది. దీనికోసం ఒక జేసీబీ, 24 బృందాలను ఏర్పాటుచేయాల్సి ఉంటుందని భావిస్తోంది.

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ పరిధిలో ఇబ్బడిముబ్బడిగా అనధికార లేఅవుట్లు వస్తున్నాయి. ఇప్పటివరకూ అధికారులు గుర్తించిన అనధికార లేఅవుట్ల సంఖ్య 184. వీఎంఆర్‌డీఏ నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా వందల ఎకరాల్లో ప్లాట్లు వేసి అమ్మేసుకుంటున్నారు. వీటిని కొన్నవారు అందులో ఏ నిర్మాణం చేపట్టినా స్థానిక సంస్థలు అనుమతులు ఇవ్వవు. లేఅవుట్ ప్లాన్ నంబరు లేకుంటే... అభివృద్ధి ... మిగతా 6వ పేజీలో

భారీ వాహనాలకు బ్రేక్ వేయరా!?

మారని ట్రాఫిక్ అధికారుల తీరు

- నగరంలోకి యథేచ్ఛగా రాకపోకలు
- చోద్యం చూస్తున్న పోలీసులు
- రోడ్లపై నిలిచిపోతున్న ట్రాఫిక్

విశాఖపట్నం, మద్దిలపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):

ఎన్ని విమర్శలు వెల్లువెత్తుతున్నా నగర ట్రాఫిక్ పోలీసుల తీరు మారడం లేదు. రద్దీ వేళల్లో నగరంలో భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడంపై 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ సమస్యపై ట్రాఫిక్ అధికారులు స్పందించి నిషేధ సమయంలో భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా చర్యలు తీసుకుంటారని అంతా ఆశించారు. కానీ శుక్రవారం కూడా భారీ వాహనాలు నగరంలో యథేచ్ఛగా తిరిగాయి. వాహనాలను అడ్డుకోవాల్సిన ట్రాఫిక్ సిబ్బంది...ఆయా వీధుల్లోకి ఇతర వాహనాలు వెళ్లకుండా స్టాపర్లను రోడ్డుకు అడ్డంగా పెట్టడం విస్మయపరిచింది.

ట్రాఫిక్, తదితర సమస్యలను దృష్టిలో పెట్టుకుని రాత్రి పది తరువాత మరుసటిరోజు ఉదయం ఏడు గంటల వరకూ మాత్రమే నగరంలోని అంతర్గత రహదారుల్లో భారీ వాహనాల ప్రవేశానికి వీలు కల్పించారు. ఒకవేళ ఏదైనా అత్యవసరమనుకుంటే పోలీస్ అధికారుల నుంచి ముందస్తు అనుమతి పొందినట్టయితే మధ్యాహ్నం 12 గంటలు నుంచి సాయంత్రం నాలుగు గంటల మధ్యలో అనుమతిస్తారు. కానీ ట్రాఫిక్ విభాగంలోని కొందరు అధికారులు, సిబ్బంది మామ్మూళ్లు తీసుకుని భారీ వాహనాలను అన్నివేళల్లోనూ అనుమతిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అలాంటిదేమీ లేదని ట్రాఫిక్ ఉన్నతాధికారులు ప్రకటించారు. కానీ అధికారుల ప్రకటనకు భిన్నంగా శుక్రవారం ఉదయం మద్దిలపాలెం, కేఆర్‌ఎం కాలనీ, చైతన్యనగర్ ప్రాంతాల్లో భారీ వాహనాలు ప్రవేశించడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఇరుకుగా ఉండే వీధుల్లోకి భారీ వాహనాలు వెళ్లడంతో ఇతర వాహనాల రాకపోకలకు అవకాశం లేకుండా పోయింది. దీంతో ... మిగతా 6వ పేజీలో



మద్దిలపాలెం కేఆర్‌ఎం కాలనీలోకి ప్రవేశించిన రెడీమిక్స్ లారీ



స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో పనులు పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

ఇండోర్ స్టేడియం పనుల జాప్యంపై కమిషనర్ అసంతృప్తి

- జనవరి నాటికి పూర్తిచేయాల్సిందిగా ఆదేశాలు

విశాఖపట్నం, సీతంపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం పనులను వచ్చే జనవరి నాటికి పూర్తిచేయాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు.స్టేడియంలో జరుగుతున్న పనులను శుక్రవారం ఆయన ... మిగతా 6వ పేజీలో

ఆ రూ.650 కోట్ల భూమి కాశీ విశ్వేశ్వరునిదే...



భూమి పత్రాలను ఈఓకు అందజేస్తున్న ఏసి

- గంగసాని అగ్రహారంలో గల 102 ఎకరాలపై ప్రైవేటు వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు
- భూమి పత్రాలను ఈవోకు అందజేసిన దేవదాయ శాఖ అసిస్టెంట్ అధికారి

సింహాచలం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొన్ని వందల ఏళ్ల క్రితం భక్తురాలు విరాళంగా ఇచ్చిన భూమి ఎట్టకేలకు సింహగిరిపై ఉన్న కాశీవిశ్వేశ్వర పంచాయతన దేవాలయానికి చెందేలా రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సింహాచలం దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వేండ్ర త్రినాథరావు వెల్లడించారు. విశాఖ జిల్లా ఆనందపురం మండలం గంగసాని అగ్రహారంలో సర్వే నంబర్లు 3/1, 3/4లలోని సుమారు 102 ఎకరాలను కాశీ విశ్వేశ్వరునికి ఒకరు విరాళంగా ఇచ్చారు. ఆ భూమిపై 2009లో మేడూరి అప్పలనరసింహమూర్తి అనే వ్యక్తి దేవదాయ శాఖ ట్రిబ్యునల్‌లో కేసు దాఖలు చేయగా 2010లో దేవస్థానానికి అనుకూలంగా తీర్పు వచ్చింది. దానిపై 2010లో మరొకసారి అప్పలనరసింహమూర్తి రాష్ట్ర హైకోర్టులో కేసు వేశారు. ఆ రిట్ పిటిషన్‌ను ఈనెల ఐదో తేదీన హైకోర్టు కొట్టివేసింది. న్యాయపరమైన అడ్డంకులన్నీ తొలగిపోవడంతో శుక్రవారం దేవదాయ శాఖ విశాఖ అసిస్టెంట్ కమిషనర్ టి.అన్నపూర్ణ భూమికి చెందిన దస్త్రాలను సింహాచలం దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వేండ్ర త్రినాథరావుకు అందజేశారు. ఆ భూమి విలువ సుమారు రూ.650 కోట్లు ఉంటుందని ఈఓ ప్రాథమికంగా అంచనా వేశారు. అది మరొకసారి అన్యాక్రాంతం ... మిగతా 6వ పేజీలో


ఆస్పత్రిలో జరుగుతున్న రోడ్డు పనులు

సీహెచ్‌సీలో అంతర్గత రోడ్ల నిర్మాణం

భీమునిపట్నం,నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగుల సౌకర్యార్థం అంతర్గత రోడ్లు వేస్తున్నారు. ఆస్పత్రి ఆవరణలో గతంలో ఉన్న రోడ్లు పూర్తిగా పాడై, రాళ్లు తేలిపోవడంతో గర్భిణులు, బాలింతలు నడవలేక ఇబ్బందులు పడేవారు. ఈమేరకు వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారుల ఆదేశాలతో రాష్ట్ర మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అంతర్గత రోడ్లు నిర్మిస్తున్నారు. ప్రధాన ద్వారం నుంచి ఓపీ, ఇన్ పేషంట్ వార్డులు, ల్యాబ్, మార్చురీ విభాగాలకు రహదారులు నిర్మిస్తున్నారు.

నేడు సీఆర్‌పీల సదస్సు

భీమునిపట్నం (రూరల్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాతీయ రహదారి పక్కనున్న మహారాజుపేట వద్ద ప్రైవేటు ఫంక్షన్ హాల్లో శనివారం ఉత్తరాంధ్ర జిల్లాలోని క్లస్టర్ రీసోర్స్ పర్సన్ల సదస్సు జరగనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయ విద్యార్హత కలిగి ఎంఈఓల వద్ద పనిచేస్తున్న సీఆర్పీలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారిపై సదస్సులో చర్చిస్తామని చెప్పారు. సదస్సుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు హాజరుకానున్నట్టు తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్ విద్యార్థులకు శిక్షణ

తగరపువలస, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో విద్యార్థులు కొన్ని చిట్కాలు తెలుసుకుంటే విజయం సాధించవచ్చునని గుంటూరు జిల్లా రేపల్లెకు చెందిన విద్యావేత్త బి. రాజారావు అన్నారు. చిట్టివలస ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎన్‌ఎంఎంఎస్ శిక్షణ తరగతుల్లో శుక్రవారం ఆయన మాట్లాడారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధించడానికి క్రమ పద్ధతిలో సైన్స్, లెక్కలు, ఇంగ్లీషు చదవాలని చెప్పారు. అలాగే తక్కువ సమయంలో ఎక్కువ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలన్నారు. అనంతరం ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సంస్థ వ్యవస్థాపకుడు జి. మోహనరావు, కార్యదర్శి రేఖ అప్పారావు విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేశారు.

200 మంది రక్తదానం


రక్తదానం చేస్తున్న గీతం కార్యదర్శి భరద్వాజ

ఎండాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 200 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్, జిమ్‌సర్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా గీతం విద్యాసంస్థల కార్యదర్శి ఎం. భరద్వాజ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి రక్తం అందించడం వల్ల ప్రాణాలు నిలుస్తాయని, ప్రస్తుత అవసరాలను గుర్తించి యువత స్వచ్ఛందంగా రక్త దానానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిమ్‌సర్ ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ బి. గీతాంజలి, జిమ్‌సర్ డీన్ డాక్టర్ ఎస్వీ రావు, జిమ్‌సర్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వసంత కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జోడుగుళ్లపాలెంలో టీడీపీ సభ్యత్వ నమోదు

విశాలాక్షినగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 9వ వార్డు జోడుగుళ్లపాలెంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు ఆధ్వర్యంలో శుక్రవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు గరికిన నూకరాజు, మైలపల్లి శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

కమనీయంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు.

మలేరియా పట్ల అప్రమత్తం

సాగర్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ స్వర్ణభారతినగర్‌లో శుక్రవారం జాతీయ కీటక వ్యాధి నియంత్రణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మలేరియా విభాగం సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, ఇన్‌స్పెక్టర్ మంగరాజు, రవి, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఎండాడ : ప్రత్యేక అలంకరణలో పశుపతినాథేశ్వరుడు, ఆలయ ఆవరణలో జ్వాల తోరణం


సింహాచలం : పూజలో పాల్గొన్న భక్తులు

ఆలయాల్లో వైభవంగా కార్తీక పౌర్ణమి పూజలు

ఎండాడ, నవంబరు (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని 8,9వ వార్డు పరిధిలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎండాడ పశుపతినాథేశ్వర స్వామి ఆలయంలో వేకువజాము నుంచి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో రుద్రాభిషేకాలు, జ్వాలా తోరణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే కైలాసగిరి దిగువున ఉన్న భవానీ సమేత కైలాసగిరీశ్వరస్వామి ఆలయంలోనూ, కైలాసగిరిపై ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలోనూ పూజలు చేశారు.

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డులోని అన్ని ఆలయాల్లోనూ పూజలు చేశారు. సింహగిరిపై ఉన్న పవిత్ర జలధారల్లో భక్తులు వేకువజామున స్నానాలు చేసి సమీపంలోని పరమేశ్వరుని, సీతారాములను, సింహాద్రి నాథులను దర్శించుకున్నారు. సాయంత్రం పలు శివాలయాల్లో ప్రధాన ద్వారాల వద్ద జ్వాలతోరణాన్ని వెలిగించి, దాని కింద నుంచి భక్తులు తిరుగుతూ భక్తిని చాటుకున్నారు.

కొమ్మాది : అన్నంరాజునగర్‌లో ఉన్న అష్టలక్ష్మీ దేవాలయంలో అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణ, వైశాఖేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయాల ఆవరణలో దీపాలు వెలిగించి దీప దానం, సాలగ్రామ దానం, గోదానం స్వయంపాక దానం జరిపారు. అనంతరం ఆలయం వద్ద భారీ ఎత్తున దీపారాధన నిర్వహించారు. సాయంత్రం జ్వాలాతోరణం చేపట్టారు. మారికవలసలో కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలోనూ భక్తులు పూజలు జరిపారు. రాజీవ్‌గృహకల్ప, కార్పెంటర్స్‌కాలనీ, పీఎంపాలెం కాలనీ, చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలోనూ పూజలు నిర్వహించారు.

పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో కార్తీక పౌర్ణమి ఘనంగా నిర్వహించారు. పద్మనాభం, పొట్నూరు, గెద్దపేట నారాయణేశ్వరస్వామి, ఉమానీలకంఠేశ్వర స్వామి, లక్ష్మీగణపతి ఆలయాల్లో పరమశివునికి విశేష అభిషేకాలు చేశారు. సాయంత్రం వందలాది మంది భక్తులతో దీపారాధన చేయించారు. అనంతరం జ్వాలా తోరణం వెలిగించారు.

కొనసాగుతున్న మత్స్యకారుల రిలే దీక్షలు

భీమునిపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భీమిలి నుంచి విశాఖ వరకూ తీరం వెంబడి అక్రమంగా నిర్మించిన బార్ అండ్ రెస్టారెంట్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మత్స్యకార నాయకుడు గంటా నూకరాజు డిమాండ్ చేశారు. విశాఖ జిల్లా మత్స్యకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జోనల్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీరంలో సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన రెస్టారెంట్‌లపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. శ్మశానవాటికలను ఆక్రమించి, నిర్మాణాలు జరుగుతున్నా.. ఎవరూ స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ సమస్యలను పరిష్కరించే వరకూ దీక్షలను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు నరసింగరావు, అప్పారావు, కొండబాబు, షణ్ముఖరావు, వాసుపల్లి గరగయ్య పాల్గొన్నారు.


రిలే దీక్షలో పాల్గొన్న మత్స్యకారులు


ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఆర్జేడీ భాస్కర్

భీమిలి కేజీబీవీని సందర్శించిన ఆర్‌జేడీ

భీమునిపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గొల్లలపాలెం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయ భాస్కర్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బాలికలను ఉద్దేశించి మాట్లాడారు. సమయాన్ని వృథా చేయకుండా బాగా చదువుకోవాలని చెప్పారు. ముఖ్యంగా విలువలతో కూడిన విద్యను అభ్యసించి, సమాజంలో ఉత్తమ పౌరులుగా గుర్తింపు పొందాలన్నారు. అనంతరం భోజనాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు ఎంఈవో -2 జయప్రద, విద్యాలయం ప్రిన్సిపాల్ కుమారి ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ భీమిలి సమన్వయకర్తగా రాజు

భీమునిపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) :భీమిలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా నందూరి వీర్రాజు (కళింగ రాజు) నియమితులయ్యారు. ఈమేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిళారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ పార్టీలో ప్రతిఒక్కరిని సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గంలో బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

తొట్లకొండ తీరంలో ఇసుక తవ్వకాలు


తీరంలో జరిపిన ఇసుక తవ్వకాలు

భీమునిపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్‌రోడ్ తొట్లకొండ ఎదురుగా ఉన్న సముద్ర తీరంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. తవ్వకాల వల్ల తీరంలో పెద్ద గొయ్యి ఏర్పడింది. అక్రమార్కులు రాత్రి వేళ ఇసుక చోరీకి పాల్పడి ఉంటారని పలువురు అనుమానిస్తున్నారు. తవ్వ కాలపై అధికారులు నిఘా పెట్టాలని కోరుతున్నారు.

ముగిసిన బాలల సైన్స్ కాంగ్రెస్

సాగర్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గీతం వర్సిటీలో జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా జరుగుతున్న బాలల సైన్స్ కాంగ్రెస్ 2024 శుక్రవారంతో ముగిసింది. దక్షిణ భారతదేశంలోని పలు రాష్ట్రాల నుంచి నవోదయ విద్యార్థులు, అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు హాజరయ్యారు. చివరి రోజు గీతం పరిశోధకులతో పాటు బాబా అణుశక్తి పరిశోధనా కేంద్రం, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ వంటి ప్రముఖ సంస్థల నుంచి శాస్త్రవేత్తలు హాజరై, పలు అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో గీతం వీసీ ప్రొఫెసర్ గౌతమ్‌రావు, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కృష్ణ, నవోదయ సమితి డిప్యూటీ కమిషనర్ టి. గోపాలకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ ఉమాపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గీతంలో డే కేర్ సెంటర్ ప్రారంభం


దే కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డీసీపీ లత, ఎంపీ శ్రీభరత్

సాగర్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గీతం వర్సిటీలో విధులు నిర్వహిస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది, పిల్లల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్‌ను డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ అజితావా జండ్ల, ఎంపీ శ్రీభరత్ శుక్రవారం ప్రారంభించారు. దాదాపు 55 మంది చిన్నారులను సంరక్షించేలా వివిధ సౌకర్యాలతో డే కేర్ సెంటర్‌ను తీర్చిదిద్దారు. బాలల సంరక్షణతో పాటు వారి మానసిక, శారీరక ప్రగతికి ఉపయోగపడేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో గీతం ఇన్‌ఛార్జి వీసీ గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన

భీమునిపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, తాలూకా ప్రభుత్వ పించన్‌దారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు టి. భీమారావు, రిటైర్డ్ హెచ్‌ఎం ఎస్. ఆనందరావు మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్ర మంలో గ్రంథాలయాధికారి ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం : విద్యార్థులు పుస్తక పఠనం ఎక్కువగా అలవాటు చేసుకోవాలని విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ తిరునగరి సాయి ప్రకాశ్ అన్నారు. అడివివరం శాఖా గ్రంథాలయంలో నరసింహం ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనాన్ని అందరూ అలవాటు చేసుకోవాలన్నారు.

డైట్‌లో ఘనంగా బిర్సా ముండా జయంతి

భీమునిపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డైట్ కళాశాలలో ఆదివాసీ నాయకుడు బిర్సా ముండా జయంతి పురస్కరించుకుని ఆదివాసీ వారసత్వ పరిరక్షణ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతికుమారి మాట్లాడుతూ ఆదివాసీ ప్రజల హక్కుల కోసం పోరాడిన యువకిశోరం బిర్సా ముండా అని కొనియాడారు. అనంతరం ఛాత్రోపాధ్యాయులు కళాశాల ఆవరణలో విల్లంబులు, బెలూన్లతో ప్రదర్శన నిర్వహించారు.

వాహనాల వేలానికి సన్నాహాలు


వాహనాలను పరిశీలిస్తున్న పోలీసులు

కొమ్మాది, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పలు కేసుల్లో పట్టుబడి డంపింగ్ యార్డులో మగ్గిపోతున్న వాహనాలను సీపీ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు డీసీపీ లత, ఏడీసీపీ మోహనరావు, ఏసీపీలు వెంకటరావు, లక్ష్మణరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు నగరానికి చెందిన 20 క్రైం విభాగాల స్టేషన్ల నుంచి ఆరుగురు సీఐలు, ఎస్ఐలు, సిబ్బందితో కలిసి క్రైమ్ విభాగానికి చెందిన వాహనాలను నిర్ధారించారు. ఇకడ మొత్తం పది వేలకు పైగా బైక్‌లు, కార్లు, ఆటోలు ఉండగా వాటిలో క్రైం కేసుల్లో పట్టుబడిన వాహనాలను గుర్తించి, మార్కింగ్ చేశారు. మిగిలిన విభాగాల వాహనాలను కూడా గుర్తించి, ప్రత్యేకంగా ఉంచుతామని డీసీపీ లత తెలిపారు. అలాగే ఇకపై పట్టుబడిన వాహనాలను ఆ ఏరియా కోర్టు పరిధిలో ఉన్న డంపింగ్ యార్డు వద్ద ఉంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే అన్ని వాహనాలకు వేలం వేస్తామని చెప్పారు.

ఆ రూ.650 కోట్ల భూమి కాశీవిశ్వేశ్వరునిదే...

... 5వ పేజీ తరువాయి

కాకుండా చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని, దానిలో ప్రస్తుతం ఉన్న పండ్ల చెట్లను లెక్కగట్టి బహిరంగ వేలం ద్వారా ఫలసాయం అనుభవించేందుకు కాంట్రాక్టు ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. త్వరలో మరికొన్ని భూములను కూడా కోర్టు ఆదేశాలతో స్వాధీనం చేసుకోనున్నట్టు ఈఓ ప్రకటించారు. విలేకరుల సమావేశంలో దేవస్థానం కార్యనిర్వాహక ఇంజనీర్ డీజీ శ్రీనివాసరాజు, లీగల్‌సెల్ ఏఈఓ రమణమూర్తి, ప్యానల్ న్యాయవాది ఎస్.ఆర్.వర్మ పాల్గొన్నారు.

ఘనంగా రాధాకృష్ణ మహోత్సవం

భీమునిపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పూర్ణిమ పురస్కరించుకుని గోస్తనీ సాగర తీరంలో శుక్రవారం రాధాకృష్ణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గుల్ పార్క్ వద్ద ఉన్న రాధాకృష్ణ ఆలయంలో తొలుత కలశ ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా అక్కరమాని శ్వేత, అవినాష్ దంపతుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ మాజీ ఛైర్మన్ అక్కరమాని విజయనిర్మల, నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం నాయకులు బమ్మిడి ఉమా సూర్యనారాయణ, గుడ్డాల ఎల్లయ్య, గొలగాని నరేంద్రకుమార్, పాసి త్రినాథ్‌కుమార్, అక్కరమాని రామునాయుడు, పిన్నింటి వెంకటరమణ, కోరాడ రమణ, కోండ్రు రామసూరప్పడు తదితరులు పాల్గొన్నారు. అలాగే, నియోజకవర్గ టీడీపీ నాయకులు కోరాడ రాజబాబు, వైసీపీ నాయకులు ముత్తంశెట్టి మహేష్ ప్రత్యేక అతిథులుగా వచ్చి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు గొలగాని నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో గొల్లవీధి శ్రీకృష్ణ జంక్షన్ నుంచి అధికసంఖ్యలో యాదవ మహిళలు కలశాలతో కోలాటాలు, తదితర జానపద కళలతో ఊరేగింపుగా బీచ్‌రోడ్‌లో వున్న శ్రీరాధాకృష్ణ ఆలయానికి చేరుకున్నారు. సాయంత్రం తీరంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


కళాశాలతో మహిళల ఊరేగింపు

తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా లీలావతి

పద్మనాభం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయినాడకు చెందిన సీనియర్ టీడీపీ నాయకురాలు, రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు కరిమిన లీలావతికి తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పదవి వరించింది. ఈమేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. లీలావతి గత 24 ఏళ్లుగా టీడీపీలో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. 2001లో తొలిసారి ఎంపీటీసీగా గెలుపొందిన ఆమెను ఎంపీపీ పదవి వరించింది. 2006 నుంచి 2011 వరకు పంచాయతీ సర్పంచ్‌గా, 2014 నుంచి 2019 వరకు ఎంపీటీసీ సభ్యురాలిగా పదవులు పొందారు. టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా, రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగానూ పని చేశారు.


దేవస్థానం భూముల్లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

గుడిలోవ దేవస్థానం భూములు స్వాధీనం

ఆనందపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుడిలోవ శ్రీ రంగనాథ నారాయణేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన భూములను హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం రెవెన్యూ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. గుడిలోవలో ఉన్న రంగనాథస్వామి దేవస్థానానికి అదే గ్రామంలో సర్వే నెంబరు 69లో 26.25 ఎకరాలు, సర్వే నెంబరు 7లో 9.43, సర్వే నెంబరు 63-1లో 2.78, సర్వే నెంబరు 70-2లో 8.62 ఎకరాలు ఉన్నాయి. వాటిని దేవాలయం నిర్వహణ కోసం దాతలు ఇచ్చారు. ప్రస్తుతం ఆ భూములకు విపరీతమైన ధర ఉండడంతో సర్వే నెంబరు 69లో ఉన్న 26.25 ఎకరాలను దక్కించుకోవడానికి కొంతమంది యత్నించారు. రికార్డులు తారుమారు చేశారు. ఈలోగా ఆ భూములకు సంబంధించి రెవెన్యూ అధికారులు దేవస్థానం పేరిట పాసు పుస్తకాలు జారీ చేశారు. దీంతో భూములు తమవని కొంతమంది 15 ఏళ్ల క్రితం హైకోర్టుకు వెళ్లి రెండు రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. కోర్టు ఆ భూములు దేవాలయానికి చెందినవిగా తీర్పు వెలువరించింది. ఈమేరకు దేవదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ టి. అన్నపూర్ణ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు భూములను స్వాధీనం చేసుకుని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది ఎస్‌వీఎస్ ప్రసాద్ వర్మ, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీధర్, ఆలయ ఈఓ ఎస్. నానాజీబాబు తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో పుణ్య స్నానాలు


బీచ్‌లో మహిళల సముద్ర స్నానాలు, పూజలు

భీమునిపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పూర్ణిమ పురస్కరించుకుని పట్టణంలోని గోస్తనీ సాగర సంగమంలో భక్తులు శుక్రవారం స్నానాలు ఆచరించారు. తెల్లవారుజాము నుంచి భీమిలి, విజయనగరం, శ్రీకాకుళం పరిసర ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి సముద్ర స్నానాలు చేశారు. అలాగే తీరంలోని ఇసుకలో శివ లింగాలను చేసి పూజలు జరిపారు.భక్తులకు నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం మహా నారాయణసేవ ఏర్పాటు చేసింది. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఎమ్మెల్యేల లిక్కర్ దందా

... 5వ పేజీ తరువాయి

లక్షలు ఖర్చుపెట్టి దుకాణం ప్రారంభించిన వ్యాపారి ఒకరు...పది రోజుల తర్వాత బీచ్‌రోడ్డులోకి దుకాణాన్ని మార్చుకున్నారంటున్నారు. నగరంలోని ప్రజా ప్రతినిధి ఒకరు తన నియోజకవర్గ పరిధిలో నోటిఫైడ్ దుకాణాలను లాటరీలో దక్కించుకున్నవారి నుంచి మూడింటిని స్వాధీనం చేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. మూడు దుకాణాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో మరో నాలుగు దుకాణాలు ఏర్పాటుచేయాల్సి ఉన్నప్పటికీ అందుకు లైసెన్స్ ఇవ్వకుండా తనకు అస్మదీయుడైన కీలక అధికారి ద్వారా చక్రం తిప్పారంటున్నారు. ప్రజా ప్రతినిధుల మెప్పు కోసం కొంతమంది ఎక్సైజ్ అధికారులు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వ్యాపారులు లబోదిబోమంటున్నారు. నగరానికి చెందిన మరొక ప్రజా ప్రతినిధికి సన్నిహితుడైన ప్రముఖ మద్యం వ్యాపారి ఒకరు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో కార్పొరేట్ సెల్‌లో దుకాణం ఏర్పాటుచేస్తున్నారు. దుకాణం మొదటి అంతస్థులో ఉండడంతో పైకి ఎక్కేందుకు రోడ్డువైపు నుంచి మెట్లు లేకపోవడంతో ఫుట్‌పాత్‌ను ఆక్రమించేసి మరీ ర్యాంపు నిర్మించేస్తున్నారు. జీవీఎంసీ, పోలీస్ అధికారులను అటు వైపు చూడొద్దని సదరు ప్రజాప్రతినిధి ఆదేశించినట్టు ప్రచారం జరుగుతోంది.కమర్షియల్ భవనంలో మాత్రమే అలాంటి దుకాణం ఏర్పాటుచేయాలని, అయితే నివాసానికి ప్లాన్ కలిగిన భవనంలో ఏర్పాటుచేస్తున్నాసరే అధికారులు ముందు వెనుకా ఆలోచించకుండా లైసెన్స్ మంజూరు చేయడం విడ్డూరంగా ఉందని అంటున్నారు.

అనధికార లేఅవుట్లకు చెక్

... 5వ పేజీ తరువాయి

చార్జీలను జరిమానాతో సహా కట్టాల్సిందే. ఆ భారాన్ని కొనుగోలుదారులపై వేసి లేఅవుట్ డెవలపర్లు తప్పుకుంటున్నారు. అనుమతి లేనందునే తాము తక్కువ ధరకు ఇచ్చామని చెబుతున్నారు. వీరికి పంచాయతీల అధికారులు సహకరిస్తున్నారు. వాస్తవానికి అనధికార లేఅవుట్ వేయగానే స్థానిక సెక్రటరీ వీఎంఆర్‌డీఏకు సమాచారం ఇవ్వాలి. కానీ అలా చేయడం లేదు. కొనుక్కున్నవారు మోసపోయినప్పుడు వచ్చి ఫిర్యాదు చేస్తే తప్ప తెలియడం లేదు. వీటికి చెక్ పెట్టాలని వీఎంఆర్‌డీఏ నిర్ణయించింది. తన వెబ్‌సైట్‌లో అనధికార లేఅవుట్ల వివరాలను ఉంచింది. మండలం, గ్రామం, సర్వే నంబర్లు, లేఅవుట్ విస్తీర్ణం అన్నీ పెట్టింది. వాటిలో ప్లాట్లు కొనవద్దని కూడా సూచించింది.

చర్యల కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్

అనుమతులు లేకుండా ఎవరైనా లేఅవుట్ వేస్తే గతంలో ఫిర్యాదు వచ్చినప్పుడు రాళ్లు తొలగించడం, మార్గానికి అడ్డంగా తవ్వడం వంటి చర్యలు చేపట్టేవారు. అయితే అవి నామమాత్రంగానే ఉండేవి. ఆ చర్యలకు ఎవరూ వెనక్కి తగ్గడం లేదు. ఇకపై గుర్తించిన అనధికార లేఅవుట్లపై వెంటనే చర్యలు చేపట్టేందుకు అవసరమైనవన్నీ సమకూర్చుకోవాలని నిర్ణయించారు. ఒక జేసీబీని నిత్యం అందుబాటులోకి ఉంచుకుంటారు. అలాగే 24 బృందాలను ఏర్పాటు చేసుకొని, వారికి ప్రాంతాలను కేటాయిస్తారు. ఆయాచోట్ల అనధికార లేఅవుట్లు వేస్తే వారిదే బాధ్యత. వారే చర్యలు తీసుకోవాలి.

ఎక్కడెక్కడ ఎక్కువంటే?

ఆనందపురం, పద్మనాభం, భీమిలి, పెందుర్తి, పరవాడ, సబ్బవరం, అనకాపల్లి, చోడవరం, నక్కపల్లి, పాయకరావుపేట, రాంబిల్లి, విజయనగరం, డెంకాడ, బొండపల్లి ప్రాంతాల్లో అనధికార లేఅవుట్లు అధికంగా ఉన్నాయి.

భారీ వాహనాలకు బ్రేక్ వేయరా!?

... 5వ పేజీ తరువాయి

వాహన చోదకులు ఇరువైపులా గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. చైతన్యనగర్‌లో అయితే భారీవాహనం వెళ్లిన రోడ్డులోకి ఇతర వాహనాలు వెళ్లకుండా పోలీస్ సిబ్బంది ఏకంగా స్టాపర్‌ను అడ్డంగా పెట్టి మరీ సహకరించడం ఆరోపణలకు బలాన్ని చేకూర్చినట్టయింది. అదేవిధంగా భారీ కంటెయినర్లు, సరకు లోడుతో ఉన్న భారీ లారీలు శుక్రవారం సాయంత్రం అక్కయ్యపాలెం, ద్వారకా నగర్, మద్దిలపాలెంలోని వీఎంఆర్‌డీఏ షాపింగ్ కాంప్లెక్స్ రోడ్డులోకి వెళుతూ కనిపించాయి. మామూళ్లు అందుతుండడం వల్లే ట్రాఫిక్ పోలీసులు భారీవాహనాలను అడ్డుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ఇండోర్ స్టేడియం పనుల జాప్యంపై కమిషనర్ అసంతృప్తి

... 5వ పేజీ తరువాయి

పరిశీలించారు. స్టేడియం లోపల కలియతిరిగిన ఆయన పనులు జాప్యం కావడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. స్టేడియంలో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలు నిర్వహించేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు, సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రేక్షకులు సౌకర్యవంతంగా కూర్చొనేందుకు అవసరమైన సీట్లు, ఏసీ, లైటింగ్ సమకూర్చాలని ఆదేశించారు. టెన్నిస్ కోర్టు వృథాగా ఉండడంతో నిరంతరం నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇండోర్ స్టేడియంలో భద్రపరచిన ఎన్నికల సామగ్రిని వేరొకచోటకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను స్థానిక కార్పొరేటర్ సాడిపద్మారెడ్డి, 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు కోరారు. కమిషనర్ వెంట జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి, చీఫ్ ఇంజనీర్ శివప్రసాదరాజు, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

☛ సంక్షిప్తంగా..

కాంగ్రెస్ పార్టీ 'తూర్పు' ఇన్‌చార్జిగా ప్రియాంక



సిరిపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రియాంక దండి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం నియోకవర్గంలో పోరాడుతున్న తన సేవలను గుర్తించి కాంగ్రెస్ అధిష్టానం విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమిస్తూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ఆదేశాలు జారీ చేయడం ఆనందంగా ఉందన్నారు. తనకు పదవి రావడానికి సహరించిన రాష్ట్ర అధికార ప్రతినిధి డా.నూతన్ నాయుడు, నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. .ఇకపై నియోజకవర్గంలోని సమస్యలపై మరింతగా పోరాడుతానని ప్రియాంక పేర్కొన్నారు.

గుంతలు పూడ్చివేత



రోడ్లపై గుంతలు పూడ్చుతున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని ప్రధాన రహదారులతో పాటు వీధుల్లోని రోడ్లపై ఉన్న గుంతల పూడ్చివేతకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాల మేరకు యుద్ధప్రాతిపదికన రహదారులకు మర్మతులు చేస్తున్నట్లు జీవీఎంసీ సహాయ ఇంజనీర్ అప్పలనాయుడు తెలిపారు.

నిందితుడి కోసం గాలింపు

గాజువాక, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పెదగంట్యాడ ప్రాంతంలో యువతిపై రాడ్డుతో దాడి చేసిన వ్యక్తి కోసం న్యూపోర్టు పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. దాడిలో గాయపడిన మేఘన గాజువాకలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ దాడికి పాల్పడిన జమ్ము కశ్మీర్ ప్రాంతానికి చెందిన నీరజ్ శర్మనుపట్టుకునేందుకు హార్బర్ ఏసీపీ ఎస్.కాశీ దాసు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు.

చిన్నారి అపహరణకు యత్నించిన మహిళల కోసం గాలింపు

గాజువాక, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) :గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చిన్నారిని అపహరించేందుకు ప్రయత్నించిన కేసులో పరారైన ఇద్దరు మహిళల కోసం గాజువాక పోలీసులు గాలిస్తున్నారు. స్థానికంగా సీసీ కెమెరాలు అందుబాటులో లేకపోవటంతో అందుబాటులో ఉన్న సాంకేతిక టెక్నాలజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

● **కంగువా :** సంగం, జగదాంబ, మెలోడీ, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక)
● **మట్కా :** శరత్, శారద, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
● **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** లిఖిత (శ్రీహరిపురం)
● **క :** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
● **లక్కీ భాస్కర్:** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
● **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
● **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
● **దేవర :**రమాదేవి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 28, వంకాయలు (తెలుపు) 42,వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 28, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 34, బీరకాయలు 36, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 30, క్యారెట్ 60 దొండకాయలు 30, బంగాళ దుంపలు 40, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 36, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్ది) 25, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 50, కీరదోస 28, క్యాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడ దుంపలు 32, కంద 66, దేముదు చిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	92
ఫారం ధర	112
విత్ స్కిన్	194
స్కిన్‌లెస్	204

కోలాహలంగా కార్తీక పూజలు

» ప్రత్యేక ఆకర్షణగా జ్వాలా తోరణం » శివనామస్మరణలో మార్మోగిన ఆలయాలు



ఆరిలోవ : జ్వాలాతోరణంలో పాల్గొన్న భక్తులు

ఆరిలోవ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని ఆరిలోవలో గల పలు శివాలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా తిరువిగ్రహాలను నగర వీధుల్లో మేళతాళాల మధ్య ఊరేగించారు. సాయంత్రం వైభవంగా నిర్వహించిన జ్వాలా తోరణంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. పెదగదిలిలో గల శివాలయం, చినగదిలిలో గల స్ఫటిక లింగేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకూ పూజలు చేశారు.

హెచ్‌బీ కాలనీ శివాలయంలో..

వెంకోజీపాలెం : హెచ్‌బీ కాలనీ శివాలయంలో కార్తీక పౌర్ణమి ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తుల గోత్ర నామాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. అనంతరం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో జ్వాలాతోరణ మహోత్సవం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెదవాల్తేరులో..

పెదవాల్తేరు : కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం పెదవాల్తేరులోని శ్రీకాశీ విశ్వేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి అలంకరించారు. అనంతరం శివుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం భక్తులు జ్వోలాతోరణం, ఆకాశ దీపాలు వెలిగించారు. భక్తులకు ఏటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సీహెచ్ జ్యోతి, అర్చకులు కాశీప్రసాద్, చినఅప్పారావు, వేణుగోపాల్ పాల్గొన్నారు.



దీపారాధనలో పాల్గొన్న మహిళలు

మెరైన్ డీఐజీ ఆకస్మిక సందర్శన



రుషికొండ బీచ్‌లో మెరైన్ పోలీసులతో మాట్లాడుతున్న డీఐజీ గోపినాథ్‌జెట్టి

సాగర్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్, మెరైన్ పోలీస్ స్టేషన్‌ను ఆ విభాగం డీఐజీ గోపినాథ్‌జెట్టితో పాటు మెరైన్ ఎస్పీ రవివర్మ, డీఎస్పీ బాలరాజు శుక్రవారం సందర్శించారు.డీఐజీ తొలుత మెరైన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. అక్కడ నుంచి రుషికొండ బీచ్‌కు వెళ్లి సందర్శకుల భద్రతకు తీసుకుంటున్న చర్యలను సీఐ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భం గా ఆయన స్పీడ్ బోటు ఎక్కి సముద్రంలో కొద్ది దూరం ప్రయాణించారు. సందర్శకుల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రమాద సంకేతాలను ఎప్పటికప్పుడు వివరిస్తూ, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం బీచ్‌లో విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డులు, కమ్యూనిటీ గార్డులతో మాట్లాడారు.

ఎంవీపీలో 'దుకాణం' దందా

» ఖాళీ కనిపిస్తే బడ్డీ ఏర్పాటు
» ఎంచక్కా అద్దెకు ఇచ్చేయడం
» పట్టించుకోని జీవీఎంసీ అధికారులు
» ట్రాఫిక్‌కు తప్పని ఇబ్బందులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలో ఎక్కడికక్కడే కొత్తగా బడ్డీలు (దుకాణాలు) వెలుస్తున్నాయి. దీనిపై జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు వ్యక్తులు ఇక్కడ స్థలాలను ఆక్రమించి బడ్డీలను ఏర్పాటు చేసుకొని ఎంచక్కా అద్దెలకు ఇచ్చుకుంటున్నారు. ఈ ప్రాంతంలో ఇదో తరహా దందా నడుస్తోంది. ఇది తెలిసిన మామూళ్ల మత్తులో జీవీఎంసీ అధికారులు, స్థానిక సచివాలయ సిబ్బంది పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే ప్రతి కూడలి నుంచి రోడ్డు పక్కన బారీగా బడ్డీలు వెలిసి ఉన్నాయి. ఎక్కడైనా ఖాళీ కనిపిస్తే అక్కడ వెంటనే మరో బడ్డీ ఏర్పాటు అయిపోతోంది. వెంటనే ఏదో వ్యాపారం మొదలవుతోంది. ఈ బడ్డీల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. చాలా చోట్ల ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడం సరేసరి. వీరికి బడ్డీ వంటివి ఉండవు. ఫుట్‌పాత్ పైనే నిర్దేశిత సమయంలో ఆయా సామగ్రి పెట్టి వ్యాపారాలు సాగిస్తుంటారు. దీనివల్ల పాదచారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిపై కూడా అధికారులు దృష్టి సారించడం లేదు.

ఇటీవల బడ్డీల సంస్కృతి పెరిగిపోతున్నా, అధికారులు పట్టించుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని స్థానికులు, వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. వీటిని నియంత్రించకుంటే రానురాను ఈ ప్రాంతంలో ట్రాఫిక్ మరింత దారుణంగా తయారవుతుందని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఎంవీపీ టీటీడీ సర్కిల్ నుంచి ఉషోదయ కూడలికి వెళ్లే మార్గంలో కొత్తగా వెలసిన బడ్డీలు

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



జగదాంబ కూడలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):బురుజుపేట శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేకం, పసుపు, కుంకుమలతో పూజలు జరిపించారు. కార్తీక పౌర్ణమి పర్వదినం పురస్కరించుకొని ఉదయం 9 గంటల సమయంలో అమ్మవారికి శ్రీ చక్రన వార్చన నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

రామాలయం వద్ద దీపాలంకరణ



దీపాలను వెలిగిస్తున్న మహిళలు

వెంకోజీపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పాత వెంకోజీపాలెంలోని శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ గౌరీ పరమేశ్వరి ఉత్సవంలో భాగంగా శుక్రవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో దీపాలంకరణ చేశారు. ఇందులో భాగంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, సంఘం గౌరవ అధ్యక్షులు పీలవెంకటపరదేశినాయుడు, అధ్యక్షులు ఆడారి పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

వెంకోజీపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆటో అండ్ మోటార్స్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం డిమాండ్ చేస్తూ ఈ నెల 16న విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నట్టు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పడాల గోవింద్ తెలిపారు. కృష్ణా కళాశాల సమీపంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన ఆటో కార్మికుల సమావేశంలో గోవింద్ మాట్లాడుతూ ఆటో అండ్ మోటార్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ప్రభుత్వం చేయాలని కోరారు. ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న విజయవాడలో జరిగే మహాధర్నాలో కార్మికులంతా పాల్గొని ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలని కోరారు. భారీగా పెంచిన డీజిల్ పెట్రోల్, వంట గ్యాస్, విద్యుత్ చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలని తదితర అంశాలపై ఈ దర్నా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.మధు రెడ్డి, రాంబాబు, మూర్తి, శ్రీనివాస్, సన్యాసిరావు, జోగారావు, భాస్కర్, నర్సింగరావు పాల్గొన్నారు.

సాగరతీరంలో సందడిగా యదుమేళా వేడుకలు



గోకుల్ పార్కు వద్ద పూజలో పాల్గొన్న పల్లా సింహాచలం తదితరులు

మహారాణిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ సాగర తీరాన శుక్రవారం యదుమేళా వేడుకలు వైభవంగా నిర్వహించారు. గోకుల్ పార్కు సమీపంలోని శ్రీరంగపురం రాధాకృష్ణ ఆలయంలో జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అక్కరమాని వెంకటరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సముద్ర స్నానాలు ఆచరించాక పాలు, పెరుగు సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం సందర్శకులకు అన్న ప్రసాదాలు అందించారు. స్వామిని ఎంపీ శ్రీభరత్, నగర మేయరు గొలగాని హరివెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ మాజీ చైర్ పర్సన్ అక్కరమాని విజయనిర్మల, జిల్లా యాదవ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు భరిణికాని రామారావు, ఎన్టీఆర్ వైద్య సేవా చైర్మెన్ సీతంరాజు సుధాకర్, ఉత్తరాంధ్ర యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు, వివిధ నియోజకవర్గాల నుంచి యాదవ ప్రముఖులు పాల్గొన్నారు.

అధికారి నిర్వాకంతో కోరమాండల్ కార్మికుల ఆందోళన

ఓ కార్మికుడి చొక్కా పట్టుకొని అవమానపరిచారంటూ ఆగ్రహం



గేటు వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

మల్కాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కోరమాండల్ ఎరువుల కర్మాగారం మెయిన్ గేటు వద్ద సంస్థలో ఓ అధికారి తీరును తప్పుపడుతూ కార్మికులు శుక్రవారం మధ్యాహ్నం మూడు నుంచి రాత్రి వరకు ఆందోళన చేపట్టారు. కార్మికులంతా ఒక్కసారిగా విధులు నిలిపివేసి ఆందోళనకు దిగడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. సుమారు 200 మంది కార్మికులు యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కంపెనీలో ఉన్న పాస్ఫారిక్ యాసిడ్ ప్లాంట్-2 సీనియర్ మేనేజర్ అన్వేష్ అదే విభాగంలో పనిచేస్తున్న కార్మికుడు రాంబాబు చొక్కా పట్టుకొని అవమానపరిచే విధంగా వ్యవహరించడంతో కార్మికులు ఆందోళనకు దిగారు. రాంబాబుకు మేనేజర్ అన్వేష్, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న యూనియన్ అధ్యక్షుడు గజపతిరావు ఘటనా స్థలానికి చేరుకుని కార్మికులకు మద్దతుగా నిలిచారు. బాధిత కార్మికుడికి న్యాయం చేయాలని వారంతా డిమాండ్ చేశారు.

ఏపీ ఫైబర్.. ఏమిటీ ట్రబుల్!

» కొరవడిన అధికారుల పర్యవేక్షణ
» ఆపరేటర్ల ఇష్టారాజ్యం
» వినియోగదారులకు దూరమవుతున్న సేవలు

APSFL Andhra Pradesh State FiberNet Ltd.

రామ్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గంలోని రామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఏపీ ఫైబర్ ప్రసారాలు అత్యంత అధ్వానంగా తయారయ్యాయి. వినియోగదారులకు అతి తక్కువ ధరకే నాణ్యమైన ఇంటర్‌నెట్‌తో పాటు టీవీ ప్రసారాలను చేరువ చేసే ఉద్దేశంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ ఏపీ ఫైబర్ నెట్‌వర్కును ఏర్పాటు చేశారు. ఆదిలో ప్రసారాలు బాగానే ఉన్నట్టనిపించడంతో వినియోగదారులు కూడా మొగ్గు చూపారు. కానీ ఆ తరువాత క్రమేపీ సేవల్లో లోపాలు తలెత్తాయి. ముఖ్యంగా అధికారుల పర్యవేక్షణ కొరవడడం, స్థానిక ఆపరేటర్ల అలసత్వం కారణంగా ఏపీ ఫైబర్ సేవలు వినియోగదారులకు దూరమవుతూ వచ్చాయి. అయితే ఇటీవల ఆపరేటర్లు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఏపీ ఫైబర్ ప్రసారాలు దారుణంగా తయారయ్యాయి. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో సైతం ఇప్పుడు ఏపీ ఫైబర్ ప్రసారాలు సరిగా రావడం లేదు.

రామ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఏదో ఒక సాంకేతిక సమస్య పేరుతో వారంలో రెండు, మూడు రోజులు ప్రసారాలు ఉండటం లేదు. ఈ విధంగా నెలకు కనీసం పది రోజులు ప్రసారాలు నిలిచి పోతున్నాయి. దీంతో వినియోగదారులు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. ప్రస్తుతం సాంకేతిక సమస్య పేరుతో నేటికి పదిహేను రోజులుగా ప్రసారాలను నిలుపుదల చేశారు. అసలు ఏమైందని తెలుసుకునేందుకు ఫోన్‌లో సంప్రదించినా సరైన సమాధానం చెప్పడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. నెలసరి ఛార్జీలు ముందే ఠంచనుగా వసూలు చేస్తున్నారని, కానీ ఈ విధంగా రోజుల తరబడి ప్రసారాలు లేకపోయినా పట్టించుకోకపోవడం ఏమిటని వినియోగదారులు వాపోతున్నారు. గతంలో అతి తక్కువ ధరకు అందించే ఏపీ ఫైబర్ నెట్‌వర్కు కూడా ఇతర నెట్ వర్కులతో పోటీ పడి మరీ రేట్లను పెంచింది, అయినా ప్రసారాల్లో ఇసుమంతైనా నాణ్యత లేకపోగా నిర్వహణ సైతం అధ్వానంగా తయారైంది.

ఈ ప్రాంతంలో ఇప్పటికే మూడో వంతు మంది ఏపీ ఫైబర్‌ను వీడి ఇతర ప్రైవేటు నెట్‌వర్కుల సేవలకు మారిపోయారు. నగరంలోని ఇతర ప్రాంతాల్లోనూ సేవలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో స్థానిక ఆటరేటర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఏపీ ఫైబర్ సేవలను వినియోగదారులకు దూరం చేస్తున్నారని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఎకో వైజాగ్‌ను జయప్రదం చేయండి

» భారత కిసాన్ సంఘ్ పిలుపు



మొక్కలు నాటి ఎకో వైజాగ్ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సామాజిక కార్యకర్తలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ పర్యావరణ హిత మొక్కలు నాటి ఎకో వైజాగ్‌ను విజయవంతం చేయాలని భారత కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు జలగం కుమార్ స్వామి పిలుపునిచ్చారు. ఇంటి ఆవరణలో ఉసిరి, మారేడు, మర్రి చెట్లను నాటడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. ప్రతి పండగకూ ఒక దేవతా వృక్షాన్ని నాటడం ద్వారా ఎకో వైజాగ్‌ను విజయవంతం చేయవచ్చని అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఎస్‌వీవీపీ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛంద సంస్థ గ్రీన్ క్లైమేట్ బృందం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, ఏయూ సోషల్ వర్క్ విద్యార్థులు ఉషారాణి, తేజస్విని చైతన్య, గాంబియా దేశానికి చెందిన సోషల్ వర్క్ విద్యార్థి అడార్ బి సార్, సామాజిక కార్యకర్తలు రాజేశ్వరి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు స్వయంపాక దానం



పూజలు నిర్వహించి దానాలు చేస్తున్న మహిళలు

వెంకోజీపాలెం, నవంబరు 15 : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మహిళలు శుక్రవారం ఉదయం నుంచి ఉపవాసంతో పూజలు నిర్వహించి, సాయంత్రం ఇండ్లలో కేదారేశ్వరుడి వ్రతం చేసుకున్నారు. అనంతరం ఆలయాలకు వెళ్లి బ్రాహ్మణులకు స్వయంపాక దానాలను చేశారు. శాస్త్రబద్ధంగా ఉపవాసంతో పూజలు నిర్వహించి, బ్రాహ్మణులకు భత్యం ఇచ్చిన తరువాత ఉపవాసాన్ని భక్తులు విరమించుకున్నారు. ఈ సందర్భంగా కొత్త వెంకోజీపాలెంలోని గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో భక్తులు బ్రాహ్మణులకు స్వయంపాక దానం, దీప దానం, లింగ దానాలను చేశారు.

మానవతా విలువలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మణిమాల

ఆరిలోవ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరూ మానవత విలువలను పాటించాలని ఐసీఐసీఐ బ్యాంకు విశ్రాంత చీఫ్ మేనేజర్ మణిమాల పేర్కొన్నారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన శుక్రవారం దీనదయాళపురంలో గల ప్రభుత్వ బాలల పరిశీలన గృహంలో నిర్వహించిన బాలల హక్కుల వారోత్సవాలకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ హక్కులు, మానవతా విలువలపై జువెనైల్ యాక్టుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరిలోవ ఎస్ఐ రామదాసు, సూపరింటెండెంట్ వీరయ్య పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలలో పుస్తక ప్రదర్శన



పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న ఔత్సాహిక రచయితలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం ఎంవీపీ కాలనీలోని నగర శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ప్రత్యేక అతిథులుగా రచయితలు నాంచారయ్య, మేడ మస్తాన్ రెడ్డి పాల్గొని గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి కేవీఏ ఉమా మహేశ్వరరావు తెలిపారు.

అనాథలు, వృద్ధులకు నిత్యావసరాలు, దుస్తుల పంపిణీ



నిత్యావసరాలు, దుస్తులు అందజేస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ/ ఆరిలోవ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : 'మానవ సేవే, మాధవ సేవ' అన్న సత్యసాయిబాబా దివ్య సందేశాన్ని అమలు చేయడంలో భాగంగా ఎంవీపీ కాలనీలోని సత్యసాయి విద్యా విహార్ విద్యార్థులు అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాల్లో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి 99వ జన్మదినోత్సవాలలో భాగంగా ఆరిలోవలో గల అమ్మానాన్న ఓల్డేజ్ హోం, టీఎస్సార్ కాంప్లెక్స్‌లో గల ఆశ్రయ హోమ్ ఫర్ ది హోంలెస్ సంస్థల్లో ఆశ్రయం పొందుతున్న వారికి పదో తరగతి చదువుతున్న బాలబాలికలు నిత్యావసర సరుకులు, వస్త్రాలు, పండ్లు, పారిశుధ్య సామగ్రి అందజేశారు. విద్యార్థులతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



వృద్ధులతో మాట్లాడుతున్న విద్యార్థులు

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

జగదాంబ కూడలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):బురుజుపేట శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేకం, పసుపు, కుంకుమలతో పూజలు జరిపించారు. కార్తీక పౌర్ణమి పర్వదినం పురస్కరించుకొని ఉదయం 9 గంటల సమయంలో అమ్మవారికి శ్రీ చక్రనవార్చన నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి



విద్యార్థినులతో కలిసి పుస్తకాలు పరిశీలిస్తున్న మండల విద్యాశాఖ అధికారి పైడప్ప నాయుడు

జగదాంబ కూడలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నేటి తరం బాలలు పుస్తక పఠనం అలవర్చుకోవాలని మండల విద్యాశాఖ అధికారి పైడప్పనాయుడు సూచించారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయంలో ఆయన పుస్తక ప్రదర్శన ప్రారంభించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన పుస్తకాలు చదవాలన్నారు. నవలలు, కథల పుస్తకాలు, నిఘంటువులు, పోటీ పరీక్షలకు సంబంధించి, ఆధ్యాత్మిక, సాహితీ పుస్తకాలు పొందుపరిచారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఆర్.సి.హెచ్ వెంకటరావు, పీవీ నూకరాజు, ఎల్ఆర్ వర్మ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌లో రక్తదాన శిబిరం

మహారాణిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రౌండ్ టేబుల్ ఇండియా ఆధ్వర్యంలో మహారాణిపేటలోని రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్‌లో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ప్రారంభించారు. తలసేమియా వ్యాధి పీడిత చిన్నారులు ఎదుర్కొంటున్న సమస్యలను వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. రెడ్‌క్రాస్ సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శివనాగేంద్ర రెడ్డి, మక్బూద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కోట నరేష్



అక్కయ్యపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా టీడీపీ జిల్లా అధ్యక్షుడు కోట నరేష్ నియమితులయ్యారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు, కూటమి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. నాయీ బ్రాహ్మణుల సంక్షేమం, టీడీపీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు.

భర్త మరణంపై సమగ్ర విచారణకు మహిళ వినతి

డాబాగార్డెన్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):గతంలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో పనిచేసిన తన భర్త నాట్ర తాతారావు మరణం మిస్టరీగా మారిందని, సమగ్ర విచారణ చేపట్టి వాస్తవం బయటపెట్టాలని ఆయన భార్య బంగారమ్మ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో ఆమె మాట్లాడారు. తన భర్త మరణం విషయంలో 2017 నుంచి ఇప్పటి వరకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, పోలీసులు తెలియజేయలేదన్నారు. కుటుంబ పోషణ కోసం తన వారసులకు స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం ఇవ్వాలన్నారు. దళిత నేత ఎస్.రమేష్, రామ అప్పారావు, కాసా పద్మ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆగిన వేలం పాట

జగదాంబ కూడలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-4 పరిధిలోని వాణిజ్య సముదాయాలు, కల్యాణమండపాలు, మార్కెట్ల కోసం ఏర్పాటు చేసిన బహిరంగ వేలం ప్రక్రియ నిలిచిపోయింది. గురువారం వేలం నిర్వహించగా పద్మానగర్ వాణిజ్య సముదాయం కోసం ఇద్దరు మాత్రమే వచ్చారు. మిగిలిన వాటి కోసం ఎవరూ రాకపోవడంతో రెవెన్యూ అధికారులు వేలం పాట నిలిపివేశారు. నాలుగు మాసాల కోసం అధిక మొత్తం చెల్లించాల్సి రావడంతో ఎవరూ ముందుకు రాలేదని చెబుతున్నారు.

గురుద్వార్‌లో గురునానక్ జయంతి వేడుకలు

సీతంపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గురుద్వార కూడలిలోని మందిరంలో శుక్రవారం గురునానక్ దేవ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శాంతి సందేశాన్ని వ్యాప్తి చేసిన మొదటి గురువు, సిక్కు మత వ్యవస్థాపకుడు గురునానక్ దేవ్ పుట్టిన రోజు వేడుకలను సామరస్యంగా జరిపారు. మందిరంలో సిక్కులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్ పాల్గొన్నారు. గురుద్వార సద్ సంగత్ అధ్యక్షుడు డాక్టర్ దిల్జా సింగ్ ఆనంద్ తదితరులు ఎంపీ భరత్‌ను సన్మానించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రార్థనలు చేశారు.

విద్యార్థులూ...బహుపరాక్!

సీతమ్మధార, నవంబరు 15: ప్రతి విద్యార్థికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకుని తమ తల్లిదండ్రులను చైతన్యపరచాలని ద్వారకా పోలీసు స్టేషన్ ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీట్ బెల్టులు ఉపయోగించవలసిన అవసరాన్ని గుర్తు చేయాలన్నారు. సీతమ్మధార నవోదయ జూనియర్ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అతివేగంగా, ఎదుటివారికి ప్రమాదం కలగకుండా జాగ్రత్తగా వాహనాలు నడపాలని, లైసెన్స్ వచ్చిన తర్వాతనే వాహనాలు నడపాలని ఎస్ఐ సూచించారు.

చెత్తకుప్పలతో ఇబ్బందులు



బాపూజీ నగర్‌లో పేరుకుపోయిన చెత్త

కంచరపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 48వ వార్డులో చెత్త పేరుకుపోయి దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. బాపూజీ నగర్‌లో చెత్తకుప్పలను సకాలంలో తొలగించకపోవడంతో అపారిశుధ్యం రాజ్యమేలుతోంది. ఇక్కడ నివాసాల నుంచి సేకరించిన చెత్తను పోగుచేసి తొలగించకపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. శానిటరీ ఇన్‌స్పెక్టరు పర్యవేక్షణ లోపంతో సిబ్బంది తూతూ మంత్రంగా కాలువలు శుభ్రం చేస్తూ, చెత్తను తరలించడంలో తాత్సారం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదే పరిస్థితి జైభారత్ నగర్, శ్రీనివాసనగర్, బర్మాక్యాంప్, జవహర్‌లాల్ నగర్ ప్రాంతాల్లోనూ నెలకొంది. పేరుకుపోయిన చెత్తకుప్పల వద్దకు కుక్కలు చేరి చెల్లాచెదురు చేస్తుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆర్పీపేట ఉన్నత పాఠశాలలో దాహం..దాహం



పాఠశాలలో మూలకు చేరిన ఆర్వోప్లాంట్

ఆర్పీపేట (కంచరపాలెం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 56వ వార్డు పరిధి రామ్మూర్తిపంతులపేట ఉన్నత పాఠశాల్లో తాగునీరు అందుబాటులో లేక విద్యార్థుల గొంతెండుతోంది. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కార్యక్రమం కింద సుమారు రూ.5 లక్షలతో నూతన ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఆదిలోనే హంసపాదు అన్నచందంగా అది పనిచేయలేదు. ప్లాంట్‌లో మోటారు కాలిపోవడంతో రెండేళ్లగా విద్యార్థులకు తాగునీరు అందుబాటులో లేదు. ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న దాదాపు 800 మంది విద్యార్థులకు బోరింగ్ వద్ద నీటిని పట్టి అందిస్తున్నారు. ఈ సమస్యను ఇటీవల పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు దృష్టికి స్థానికులు తీసుకువెళ్లి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావును ప్రశ్నించగా ప్లాంట్ పనిచేయకపోవడంతో చాలాసార్లు కంపెనీ టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. కంపెనీ ప్రతినిధులు వచ్చి మోటారు పాడైందని చెప్పి వెళ్లిపోయారని, మరమ్మతులు చేపట్టలేదని అన్నారు. విద్యార్థులకు తాగునీటి సౌకర్యం లేకపోవడం పట్ల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు ఈ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఉమా నీలకంఠేశ్వరాలయం ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకారం చేసిన కొత్త సభ్యులు

అక్కయ్యపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని ఉమా నీలకంఠేశ్వరాలయం నూతన ఉత్సవ కమిటీ ఏర్పాటైంది. సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పీఎస్ఎల్ రాజు, ధర్మకర్త ఎం.గణేష్, పూజారి నాగేశ్వరరావు, వార్డు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు అకిరెడ్డి జగదీష్, కె.రమణారావు, ముక్కి రామకృష్ణ, శ్రీకృష్ణ, ముమ్మిడి నాగమణి, గురుగోవింద్ సింగ్, ఎంఎల్ఎన్ రావు, జగదీశ్వరి, సీత పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి వేడుకలు



మురళీనగర్ రామాలయంలో అర్ధనారీశ్వరుగా పరమేశ్వరుడు



అల్లిపురం వద్ద జ్వాలా తోరణ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు



ఇసుక కొండపై రమాసత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొనేందుకు గుమిగూడిన భక్తులు

మహారాణిపేట/సీతంపేట/అల్లిపురం/జగదాంబ కూడలి/కంచరపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం వివిధ ప్రాంతాల్లో భక్తులు శైవాలయాలకు భక్తులు తరలి వెళ్లారు. కేజీహెచ్ వద్ద ఉన్న ఇసుక కొండపై శ్రీరమా సత్యనారాయణ స్వామి ఆలయంలో నారాయణ మంత్రోచ్చారణతో మంగళధ్వని, వేద మంత్రాల పఠనం మధ్య అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహించారు. సుమారు వెయ్యి మంది దంపతులు సత్యనారాయణ స్వామి వ్రతాలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు జగదాంబ కూడలిలో కుమ్మరవీధి పోలమాంబ అమ్మవారి ఆలయంలో భక్తులు, అయ్యప్ప మాలధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బహుముఖ రూపాల్లో ఉన్న పోలమాంబ అమ్మవారిని ముత్తయిదువలు పసుపు, కుంకుమలతో అర్చన చేశారు. కార్తీక దీపారాధనతో మొక్కులు చెల్లించారు. పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ, జగదాంబ థియేటర్ ఎల్లమ్మ గుడికి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు దర్శనం చేసుకున్నారు. కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో శైవాలయాలు, రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిక్కవానిపాలెం, రెడ్డికంచరపాలెం, గంగన్న నగర్, గొల్లకంచరపాలెం ఆలయాల్లో పంచామృతాభిషేకాలు, విశిష్ట అలంకరణ చేశారు. సాయంకాలం శివాలయాల్లో కార్తీక పురాణ పఠనం చేశారు. భక్తులు కార్తీక దీపారాధన చేశారు. అల్లిపురం, జ్ఞానాపురం ప్రాంతాల్లో వేకువజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకొని ప్రత్యేకపూజలు చేశారు. 32వ వార్డు పరిధిలోని డీటీకే క్వార్టర్స్‌లో ఉన్న భవానీ శంకర ఆలయంలో జ్వాలా తోరణం ఘనంగా నిర్వహించారు. సీతంపేటలోగల పార్వతీశ్వరాలయంలో పౌర్ణమి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద జ్వాలతోరణంలో భాగంగా శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను భక్తులు ఊరేగించారు. ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో భక్తులు అభిషేక పూజలు నిర్వహించారు.



సీతంపేటలో ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

అనధికార లేఅవుట్లకు చెక్

... 5వ పేజీ తరువాయి

చార్జీలను జరిమానాతో సహా కట్టాల్సిందే. ఆ భారాన్ని కొనుగోలుదారులపై వేసి లేఅవుట్ డెవలపర్లు తప్పుకుంటున్నారు. అనుమతి లేనందునే తాము తక్కువ ధరకు ఇచ్చామని చెబుతున్నారు. వీరికి పంచాయతీల అధికారులు సహకరిస్తున్నారు. వాస్తవానికి అనధికార లేఅవుట్ వేయగానే స్థానిక సెక్రటరీ వీఎంఆర్‌డీఏకు సమాచారం ఇవ్వాలి. కానీ అలా చేయడం లేదు. కొనుక్కున్నవారు మోసపోయినప్పుడు వచ్చి ఫిర్యాదు చేస్తే తప్ప తెలియడం లేదు. వీటికి చెక్ పెట్టాలని వీఎంఆర్‌డీఏ నిర్ణయించింది. తన వెబ్‌సైట్‌లో అనధికార లేఅవుట్ల వివరాలను ఉంచింది. మండలం, గ్రామం, సర్వే నంబర్లు, లేఅవుట్ విస్తీర్ణం అన్నీ పెట్టింది. వాటిలో ప్లాట్లు కొనవద్దని కూడా సూచించింది.

చర్యల కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్

అనుమతులు లేకుండా ఎవరైనా లేఅవుట్ వేస్తే గతంలో ఫిర్యాదు వచ్చినప్పుడు రాళ్లు తొలగించడం, మార్గానికి అడ్డంగా తవ్వడం వంటి చర్యలు చేపట్టేవారు. అయితే అవి నామమాత్రంగానే ఉండేవి. ఆ చర్యలకు ఎవరూ వెనక్కి తగ్గడం లేదు. ఇకపై గుర్తించిన అనధికార లేఅవుట్లపై వెంటనే చర్యలు చేపట్టేందుకు అవసరమైనవన్నీ సమకూర్చుకోవాలని నిర్ణయించారు. ఒక జేసీబీని నిత్యం అందుబాటులోకి ఉంచుకుంటారు. అలాగే 24 బృందాలను ఏర్పాటు చేసుకొని, వారికి ప్రాంతాలను కేటాయిస్తారు. ఆయాచోట్ల అనధికార లేఅవుట్లు వేస్తే వారిదే బాధ్యత. వారే చర్యలు తీసుకోవాలి.

ఎక్కడెక్కడ ఎక్కువంటే?

ఆనందపురం, పద్మనాభం, భీమిలి, పెందుర్తి, పరవాడ, సబ్బవరం, అనకాపల్లి, చోడవరం, నక్కపల్లి, పాయకరావుపేట, రాంబిల్లి, విజయనగరం, డెంకాడ, బొండపల్లి ప్రాంతాల్లో అనధికార లేఅవుట్లు అధికంగా ఉన్నాయి.

ఎమ్మెల్యేల లిక్కర్ దందా

... 5వ పేజీ తరువాయి

లక్షలు ఖర్చుపెట్టి దుకాణం ప్రారంభించిన వ్యాపారి ఒకరు...పది రోజుల తర్వాత బీచ్‌రోడ్డులోకి దుకాణాన్ని మార్చుకున్నారంటున్నారు. నగరంలోని ప్రజా ప్రతినిధి ఒకరు తన నియోజకవర్గ పరిధిలో నోటిఫైడ్ దుకాణాలను లాటరీలో దక్కించుకున్నవారి నుంచి మూడింటిని స్వాధీనం చేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆ మూడు దుకాణాలు ఏర్పాటుచేసిన ప్రాంతాల్లో మరో నాలుగు దుకాణాలు ఏర్పాటుచేయాల్సి ఉన్నప్పటికీ అందుకు లైసెన్స్ ఇవ్వకుండా తనకు అస్మదీయుడైన కీలక అధికారి ద్వారా చక్రం తిప్పారంటున్నారు. ప్రజా ప్రతినిధుల మెప్పు కోసం కొంతమంది ఎక్సైజ్ అధికారులు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వ్యాపారులు లబోదిబోమంటున్నారు. నగరానికి చెందిన మరొక ప్రజా ప్రతినిధికి సన్నిహితుడైన ప్రముఖ మద్యం వ్యాపారి ఒకరు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో కార్పొరేట్ స్టైల్‌లో దుకాణం ఏర్పాటుచేస్తున్నారు. దుకాణం మొదటి అంతస్థులో ఉండడంతో పైకి ఎక్కేందుకు రోడ్డువైపు నుంచి మెట్లు లేకపోవడంతో ఫుట్‌పాత్‌ను ఆక్రమించేసి మరీ ర్యాంపు నిర్మించేస్తున్నారు. జీవీఎంసీ, పోలీస్ అధికారులను అటు వైపు చూడొద్దని సదరు ప్రజా ప్రతినిధి ఆదేశించినట్టు ప్రచారం జరుగుతోంది. కమర్షియల్ భవనంలో మాత్రమే అలాంటి దుకాణం ఏర్పాటుచేయాలని, అయితే నివాసానికి ప్లాన్ కలిగిన భవనంలో ఏర్పాటుచేస్తున్నాసరే అధికారులు ముందువెనుకా ఆలోచించకుండా లైసెన్స్ మంజూరుచేయడం విడ్డూరంగా ఉందని అంటున్నారు.

భారీ వాహనాలకు బ్రేక్ వేయరా!?

... 5వ పేజీ తరువాయి

వాహన చోదకులు ఇరువైపులా గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. చైతన్యనగర్‌లో భారీవాహనం వెళ్లిన రోడ్డులోకి ఇతర వాహనాలు వెళ్లకుండా పోలీస్ సిబ్బంది ఏకంగా స్టాపర్‌ను అడ్డంగా పెట్టి మరీ సహకరించడం ఆరోపణలకు బలాన్ని చేకూర్చినట్టయింది. అదేవిధంగా భారీ కంటెయినర్లు, సరకు లోడుతో ఉన్న లారీలు శుక్రవారం సాయంత్రం అక్కయ్యపాలెం, ద్వారకానగర్, మద్దిలపాలెంలోని వీఎంఆర్‌డీఏ షాపింగ్ కాంప్లెక్స్ రోడ్డులోకి వెళ్తూ కనిపించాయి. మామూళ్లు అందుతుండడంతో ట్రాఫిక్ పోలీసులు వాహనాలను అడ్డుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ఆ రూ.650 కోట్ల భూమి కాశీవిశ్వేశ్వరునిదే...

... 5వ పేజీ తరువాయి

కాకుండా చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని, దానిలో ప్రస్తుతం ఉన్న పండ్ల చెట్లను లెక్కగట్టి బహిరంగ వేలం ద్వారా ఫలసాయం అనుభవించేందుకు కాంట్రాక్టు ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. త్వరలో మరికొన్ని భూములను కూడా కోర్టు ఆదేశాలతో స్వాధీనం చేసుకోనున్నట్టు ఈఓ ప్రకటించారు. విలేకరుల సమావేశంలో దేవస్థానం కార్యనిర్వాహక ఇంజనీర్ డీజీ శ్రీనివాసరాజు, లీగల్‌సెల్ ఏఈఓ రమణమూర్తి, ప్యానల్ న్యాయవాది ఎస్.ఆర్.వర్మ పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం పనుల జాప్యంపై కమిషనర్ అసంతృప్తి

... 5వ పేజీ తరువాయి

పరిశీలించారు. స్టేడియం లోపల కలియతిరిగిన ఆయన పనులు జాప్యం కావడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. స్టేడియంలో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలు నిర్వహించేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు, సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రేక్షకులు సౌకర్యవంతంగా కూర్చొనేందుకు అవసరమైన సీట్లు, ఏసీ, లైటింగ్ సమకూర్చాలని ఆదేశించారు. టెన్నిస్ కోర్టు వృథాగా ఉండడంతో నిరంతరం నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఇండోర్ స్టేడియంలో భద్రపరచిన ఎన్నికల సామగ్రిని వేరొకచోటకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను స్థానిక కార్పొరేటర్ సాడిపద్మారెడ్డి, 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు కోరారు. కమిషనర్ వెంట జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి, చీఫ్ ఇంజనీర్ పి.శివప్రసాదరాజు ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సాగర తీరంలో వైభవంగా యదుమేళా వేడుకలు



గోకుల్ పార్కు వద్ద పూజలో పాల్గొన్న పల్లా సింహాచలం తదితరులు

మహారాణిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ సాగర తీరాన శుక్రవారం యదుమేళా వేడుకలు వైభవంగా నిర్వహించారు. గోకుల్ పార్కు సమీపంలోని శ్రీరంగపురం రాధాకృష్ణ ఆలయంలో జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అక్కరమాని వెంకటరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సముద్ర స్నానాలు ఆచరించాక పాలు, పెరుగు సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం సందర్శకులకు అన్న ప్రసాదాలు అందించారు. స్వామిని ఎంపీ శ్రీభరత్, నగర మేయరు గొలగాని హరివెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ మాజీ చైర్ పర్సన్ అక్కరమాని విజయనిర్మల, జిల్లా యాదవ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు భరిణికాని రామారావు, ఎన్టీఆర్ వైద్య సేవా చైర్మెన్ సీతంరాజు సుధాకర్, ఉత్తరాంధ్ర యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు, వివిధ నియోజకవర్గాల నుంచి యాదవ ప్రముఖులు పాల్గొన్నారు.

ఆసుపత్రి టెండర్ల రద్దుకు డిమాండ్



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న నిరసనకారులు

అక్కయ్యపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పోర్టు ఆసుపత్రి నిర్వహణ బాధ్యతలు ప్రైవేటుకు అప్పగించేందుకు పిలిచిన టెండర్లు రద్దు చేయాలని వీడీఎల్‌బీ, డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జక్కన సత్యనారాయణ డిమాండ్ చేశారు. రిలే నిరాహార దీక్ష 46వ రోజైన శుక్రవారం ఆయన మాట్లాడుతూ 40 వేల మందికి సేవలందిస్తున్న ఈ ఆసుపత్రిని ప్రైవేటీకరించవద్దని అన్ని యూనియన్లు వ్యతిరేకించినా కేంద్ర ప్రభుత్వం, పోర్టు యాజమాన్యం ఈ నెల 18న టెండర్ తెరవడానికి సిద్ధపడుతున్నాయని మండిపడ్డారు. ప్రైవేట్ యాజమాన్యం వైద్య సేవలకు బదులు లాభాల కోసమే ఆలోచిస్తుందని పేర్కొన్నారు. గతంలో కాగ్ నివేదికలోని అంశాలను ఉటంకించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి.జగన్, కె.సత్యనారాయణ, రెడ్డి, ఆర్ఎస్ మూర్తి, రాఘవులు, శ్రీనివాస్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు

నిర్మాణాల్లో నూతన సాంకేతికత అవసరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్

మహారాణిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ అభివృద్ధికి నూతన సాంకేతికతతో కూడిన నిర్మాణాలు అవసరమని పార్లమెంట్ సభ్యుడు ఎం.శ్రీభరత్ అన్నారు. శుక్రవారం హోటల్ నోవాటెల్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ విశాఖ సెంట్రల్ ఆధ్వర్యంలో ఏఐ ఎక్స్‌పో-2024 పేరిట మూడు రోజుల వస్తు ప్రదర్శనను ఎంపీ ప్రారంభించారు. నూతన సాంకేతిక విధానంతో నిర్మాణాలు ప్రజలకు మానసిక ఉత్తేజం కలిగిస్తాయని ఎంపీ అన్నారు. విశాఖలో ఎలివేటెడ్ కారిడార్, మెట్రో, కొత్త విమానాశ్రయం ఏర్పడే నాటికి ఇతర నగరాల నుంచి విశాఖ వచ్చే వారి సంఖ్య పెరుగుతుందని, వారిని ఆకట్టుకునేలా మరిన్ని నిర్మాణాలు చేపట్టాలన్నారు. నగరానికి రానున్న ఐటి కంపెనీలు ఉద్యోగులతో పాటు పెట్టుబడుదారులను కూడా ఆకట్టుకోవాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో చైర్మన్ నాగుల రాజేష్, కార్యదర్శి రాంజీ పలువురు ఆర్కిటెక్చర్లు, వందకు పైగా సంస్థలు పాల్గొన్నాయి.

గ్రంథాలయంలో క్విజ్ పోటీలు

సీతంపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల నేపథ్యంలో ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో శుక్రవారం సాహిత్యం, తెలుగు కళారంగం, చలన చిత్రం, నాటకం, సంగీతం, నృత్యం అంశాలపై క్విజ్ పోటీ నిర్వహించారు. క్విజ్ మాస్టర్‌గా రచయిత డాక్టర్ డి.వి. సూర్యారావు వ్యవహరించి పలు అంశాలపై ప్రశ్నలు వేశారు. ఈ కార్యక్రమానికి విశాఖ సాహితీ అధ్యక్షులు డాక్టర్ కె.కనకమహాలక్ష్మి అధ్యక్షులుగా వ్యవహరించారు. క్విజ్ విజేతలకు బహుమతులు అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ డి.వి సూర్యారావు

‘పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాల్సిందే’




అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న జడ్సీ బి.రాము

జ్ఞానాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జోన్-5లో 40 నుంచి 63 వరకు ఉన్న 24 వార్డుల్లో ఏ ప్రాంతంలోనూ చెత్త కనిపించకూడదని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత పారిశుధ్య కార్మికులు, కార్యదర్శులు, పర్యవేక్షకులదేనని జోనల్ కమిషనర్ బి.రాము అన్నారు. శుక్రవారం షాదీ ఖానాలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ఆర్పీలు, డ్వాక్రా సంఘాల ముఖ్యసభ్యులతో సమన్వయం ఏర్పరుచుకొని చెత్త సేకరణ, పారబోయడం వంటి వాటిపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. క్లాప్ వాహనాలు వెళ్లేందుకు అవకాశం ఉన్న ప్రతీ ప్రాంతంలో చెత్త సేకరణ జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు కాలువల్లో, గెడ్డల్లో చెత్త వేయకుండా చూడాల్సిన బాధ్యతను కార్యదర్శులు తీసుకోవాలని, దానిపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సహాయ వైద్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ జనార్ధన్, 24 వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా రైతుబజార్‌లో స్టాల్స్ కేటాయింపు

సీతమ్మధార, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార రైతుబజార్‌లో రైతులకు స్టాల్స్ కేటాయింపు నిమిత్తం శుక్రవారం ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకుడు సతీష్‌లు లాటరీ నిర్వహించారు. రైతులు తెచ్చిన కూరగాయలను తమకు కేటాయించిన స్టాల్స్‌లో అమ్ముకోడానికి వీలుగా పారదర్శకంగా స్టాల్స్‌ను కేటాయించినట్లు ఎస్టేట్ అధికారి కొండబాబు తెలిపారు.

గాజుల అలంకరణలో గౌరీ పరమేశ్వరులు



అల్లిపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అల్లిపురం వెంకటేశ్వరమెట్ట వద్ద గౌరీ సేవాసంఘం, శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో 77వ గౌరీపరమేశ్వరుల లీలా మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం గౌరీ పరమేశ్వరులను గాజులతో అలంకరించారు. అనంతరం మాలధారణ భక్తులకు నిత్య అన్నదాన కార్యక్రమం జరుగుతుందని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పొలమరశెట్టి వెంకటశ్యామ్ కుమార్, పొలమరశెట్టి శ్రీను తెలిపారు. గాజుల అలంకరణతో ఉన్న స్వామి, అమ్మవార్లను పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు దర్శించుకున్నారు. ముఖ్యంగా మహిళలు ఈ అలంకరణ చూసి ముగ్ధులయ్యారు.

బాబా ఆలయంలో ముగిసిన నిర్విరామ నామ జపం


ఏకధాటిగా సాయి నామాన్ని జపిస్తున్న భక్తులు

అగనంపూడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని 24 గంటల పాటు ఏర్పాటు చేసిన నిర్విరామ సాయి నామ జపం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా సాయినాథుడిని ప్రత్యేక వస్త్రాలు, పుష్పాలతో అలంకరించి సాయినామాన్ని జపించారు. అనంతరం నిర్వాహకులు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు కొయ్య వెంకటరమణారెడ్డి, ప్రతినిధులు వ్యాసశర్మ, శంభుడు, సత్యశ్రీదేవి, లీలావతి, పంకజ, రాజు, పద్మ, కుమారి, పవన్, సత్యలక్ష్మి, సత్యనారాయణ, గోవిందరావు, జ్యోతి, కన్నమ్మ, కిషోర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు


పోటీలో పాల్గొన్న విద్యార్థులు

పెదగంట్యాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విశాఖ విమల విద్యాలయం, నడుపూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, మరో మూడు ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన 156 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలకు శాఖాగ్రంథాలయాధికారి పీవీ రమణ, పాఠశాలల ఉపాధ్యాయులు బాలప్రసాద్ మనోహర్, ఆలీ, కేజే విజయకుమార్ ఇన్విజిలేటర్లుగా వ్యవహరించారు. గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు.

దుర్గమాంబ ఆలయంలో పూజలు



అగనంపూడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. స్థానిక భ్రమరాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయంలో లలితా పారాయణం, విష్ణుసహస్ర నామా పారాయణాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ చిత్తా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కంగువా :** సంగం, జగదాంబ, మెలోడీ, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **మట్కా :** శరత్, శారద, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** లిఖిత (శ్రీహరిపురం)
- **క :** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :**రమాదేవి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 28, వంకాయలు (తెలుపు) 42,వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 28, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 34, బీరకాయలు 36, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 30, క్యారెట్ 60 దొండకాయలు 30, బంగాళ దుంపలు 40, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 36, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్ది) 25, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 50, కీరదోస 28, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడ దుంపలు 32, కంద 66, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు బ్రాయిలర్	
రైతు ధర	92
ఫారం ధర	112
విత్ స్కిన్	194
స్కిన్‌లెస్	204

ఆలయాల్లో కార్తీక పౌర్ణమి పూజలు

» శివాలయంలో ప్రత్యేక పూజలు, అలంకరణలు » అలరించిన జ్వాలా తోరణం, దీపారాధనలు » మార్మోగిన శివనామ స్మరణ


వడ్లపూడిలో బ్రహ్మసూత్ర శివాలయం వద్ద జ్వాలా తోరణం మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

కూర్మన్నపాలెం నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం పౌర్ణమి శుక్రవారం పురస్కరించుకొని శైవ, వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జీవీఎంసీ 87 వార్డు వడ్లపూడిలో శ్రీసీతారామలింగేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మసూత్ర శివలింగం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి నిర్వహించిన జ్వాలా తోరణంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, ఆలయ కమిటీ సభ్యులు తాతనాయుడు, మింది గోవింద్, మాటూరి రాము, కర్రి కృష్ణ, బొండా గోవింద రాజులు తదితరులు పాల్గొన్నారు. జీవీఎంసీ 86 వార్డు మాతృశ్రీ నగర్ శ్రీకాశీ అన్నపూర్ణాదేవి సమేత శ్రీవిశ్వేశ్వర దేవాలయంలో ఆలయ ధర్మకర్త దామా సుబ్బారావు, దమయంతిల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు వ్యాగ్వేశ్వర శర్మ పర్యవేక్షణలో ప్రత్యేక పూలతో శివలింగానికి అలంకరించి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. జీవీఎంసీ 88 వార్డు ఎస్టీబీఎల్‌లో శ్రీఉమారామలింగేశ్వర స్వామి వారికి ప్రధాన అర్చకులు చంద్రమౌళి శర్మ పర్యవేక్షణలో దీపారాధన నిర్వహించారు. ఓంకారం, శివలింగం, స్వస్తిక్, శంఖుచక్రాలను దీపాలతో అలంకరించి విశేష అర్చనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎస్టీబీఎల్ బాలాజీ, జీవీ కృష్ణయ్య, గంగా మహేష్, చైతన్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు. జీవీఎంసీ 88వ వార్డు గ్రీన్ సిటీ శ్రీదేవి, భూదేవి సమేత వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూపు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, ప్రధాన అర్చకులు ఇరగవరపు వాసుస్వామి, శ్రీధర్ స్వామి శిష్య బృందం పర్యవేక్షణలో శుక్రవారం రాత్రి పౌర్ణమి సందర్భంగా దీపాలంకరణ నిర్వహించారు. తొలుత శ్రీవారికి బంగారు, వెండి ఆభరణాలతో విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేష్ కుమార్, డైరెక్టరు వీవీ కృష్ణారావు, పద్మజ, రాజ్యలక్ష్మి, చిన్న సురేష్, రమేష్, శాంతి, శివ ప్రసాద్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


గ్రీన్‌సిటీలో ప్రత్యేక ఆకర్షణగా దీపారాధన

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్


పాతఅగనంపూడిలో డ్రైనేజీలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్

అగనంపూడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా రాష్ట్రం ప్రభుత్వం పనిచేస్తోందని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పేర్కొన్నారు. వార్డు పరిధి పాత అగనంపూడి పరిసర ప్రాంతా ల్లో శుక్రవారం ఆయన పర్య టించారు. పలు వీధుల్లో డ్రైనేజీలు లేక వీధుల్లో నిలిచిపోయిన మురుగు నీటిని పరిశీలించారు. స్థానికంగా సమస్యలను నివాసితులను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే ఆయా ప్రాంతా ల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుకు ప్రణాళికలను రూపొందించి పనులు చేపట్టే విధంగా చొరవ తీసుకుంటానని చెప్పారు. ఆయన వెంట వార్డు టీడీపీ నాయకులు కరణం సత్యారావు, నాగేశ్వరరావు, జీవీ ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేశ్ తదితరులు ఉన్నారు.

శ్రీకృష్ణుడి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు

శ్రీనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీనగర్ శ్రీకృష్ణుని ఆలయంలో కొలువై ఉన్న రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో, ప్రధాన అర్చకులు ఫణిభూషణ శర్మల పర్యవేక్షణలో వ్రతాలు, ప్రత్యేక పూజలు చేశారు.

పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కె.సహదేవ్, ఆవాల సూర్యనారాయణ, రాజు, పంచముఖేశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తిరుమల బాలాజీ దివ్య క్షేత్రంలో ప్రత్యేక పూజలు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్బంగా షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో నిర్వహించిన ప్రత్యేక పూజలతో పాటు శ్రీవారి పల్లకి సేవ భక్తులను ఎంతో ఆకట్టుకుంది. ఆలయ వేదపండితులు వెంకటేశ్వర స్వామివారిని పంచామృతాలతో అభిషేకించి అనంతరం ప్రత్యేక పూలు, నగలతో పాటు స్థానిక వ్యాపారవేత్త చిగురుపాటి శ్రీనివాస్ దంపతులు అందజేసిన యాలకులు, లవంగాల మాలతో స్వామి వారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

సాయంత్రం ఆలయంలో ఆకాశ దీపానికి పూజలు చేసి వెలిగించిన వేదపండితులు అనంతరం ప్రత్యేకంగా అలంకరించబడిన పల్లకిపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారిని ఆశీనులను చేసి మేళ తాళాలతో ఎస్టీబిఎల్ ప్రాంగణంలో భక్తుల గోవిందనామస్మరణ మధ్య ఊరేగించారు. ఈ పూజలలో ఆలయ పాలక మండలి సభ్యులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

86వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

కూర్మన్నపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 86వ వార్డులోని రాసాలమ్మ కాలనీలో టీడీపీ వార్డు ఇన్‌చార్జ్ నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు ఎంవీఎస్ చౌధురి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల కుటుంబాలకు విద్య, వైద్యం, ఉపాధి విషయంలో టీడీపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ స్థానిక నాయకులు వేగుంట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోరమాండల్ కార్మికుల ఆందోళన


గేటు వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

మల్కాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) :కోరమాండల్ ఎరువుల కర్మాగారం మెయిన్ గేటు వద్ద సంస్థలో ఓ అధికారి తీరును తప్పుపడుతూ కార్మికులు శుక్రవారం మధ్యాహ్నం మూడు నుంచి రాత్రి వరకు ఆందోళన చేపట్టారు. కార్మికులంతా ఒక్కసారిగా విధులు నిలిపివేసి ఆందోళనకు దిగడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కంపెనీలో ఉన్న పాస్పారిక్ యాసిడ్ ప్లాంట్-2 సీనియర్ మేనేజర్ అన్వేష్ అదే విభాగంలో పనిచేస్తున్న కార్మికుడు రాంబాబు చొక్కా పట్టుకొని అవమానపరిచే విధంగా వ్యవహరించడంతో కార్మికులు ఆందోళనకు దిగారు. మేనేజర్ అన్వేష్, రాంబాబుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న యూనియన్ అధ్యక్షుడు గజపతిరావు ఘటనా స్థలానికి చేరుకుని కార్మికులకు మద్దతుగా నిలిచారు. బాధిత కార్మికుడుకి న్యాయం చేయాలని వారంతా డిమాండ్ చేశారు.

వైభవంగా జ్వాలా తోరణం


జ్వాలా తోరణాన్ని వెలిగిస్తున్న ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్య శర్మ

పెదగంట్యాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసోత్సవాల్లో భాగంగా శనివారం నెల్లిముక్కు శివాలయం ఆవరణలో జ్వాలా తోరణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ జ్వాలా తోరణం వెలిగించారు. 75వ వార్డు కార్పొరేటర్ పులిలక్ష్మీబాయి,ఆలయ కమిటీ సభ్యులు ముద్దుర్తి శ్రీరామమూర్తి, కణితి అప్పలరాజు, పులి వెంకటరమణారెడ్డి, పాల అప్పలరెడ్డి, నెల్లిముక్కు, అయ్యన్నపాలెం, మొల్లివానిపాలెం, సీతానగరం తదితర ప్రాంతాలకు చెందిన అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ శివాలయంలో ...

ఉక్కుటౌన్‌షిప్ : స్టీల్‌ప్లాంట్ లోపల ఉన్న అతి పురాతన శివాలయంలో కార్తీక పౌర్ణమి పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం జ్వాలాతోరణం నిర్వహించారు. ప్లాంట్‌కు పూర్వ వైభవం రావాలని, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, ఉద్యోగులు యేల్లేటి శ్రీనివాసరావు, చీకటి శ్రీనివాస్, నరసింహారాజు, గురునాథ్ పాల్గొన్నారు.

మల్కాపురం : ప్రకాశనగర్‌లో ఉన్న శివరామకృష్ణ ఆలయంలో జ్వాలతోరణం వెలిగించారు. అంతకుముందు స్వామి వారికి పూజలు చేశారు. ప్రకాశనగర్, మల్కాపురం, జనతాకాలనీ, అంబేద్కర్ కాలనీ, ఏడుగుళ్ల జంక్షన్‌తో పాటు పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పూజలు చేశారు.

పెందుర్తి : మండలంలోని పలు శివాలయాల్లో కార్తీక పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు, సరిపల్లిలో ఉన్న స్వయంభు ఆలయంలో రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు జరిపారు. అలాగే లక్ష వత్తులతో జ్వాలాతోరణం నిర్వహించారు. అనంతరం మహిళలు కోనేటిలో కార్తీక దీపాలు వదిలారు. పినగాడిలోని చోడేశ్వరస్వామి ఆలయం, సుజాతనగర్‌లో విశ్వేశ్వర ఆలయంలోనూ పూజలు జరిగాయి.

వేపగుంట/ఎన్ఏడీ జంక్షన్ : నాయుడుతోట దరి కృష్ణానగర్‌లో ఉన్న దుర్గామల్లేశ్వరాలయం, ఉమాశంకరాలయం, వేపగుంట కొండపై ఉన్న శివాలయం, ముత్యాలమ్మ ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాలా తోరణం నిర్వహించారు. ముత్యాలమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన జ్వాలాతోరణం సందర్భంగా చేపట్టిన ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు పాల్గొని, పూజలు చేసి జ్వాలా తోరణం వెలిగించారు. అలాగే ఎన్ఏడీ జంక్షన్, 90వ వార్డు సుసర్ల కాలనీలో కొలువైన చంద్రమౌళీశ్వరాలయంలోనూ ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. సాయంత్రం ఆలయ ఆవరణలో జ్వాలాతోరణం వెలిగించారు.లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ ఉమా శంకర గణపతి ఆలయంలో కూడా పౌర్ణమి పూజలు నిర్వహించారు. 52వ వార్డు ఎన్ఏడీ ప్రమోద ఉమా విశ్వేశ్వరాలయంలో జరిగిన పూజల్లో డిప్యూటీ మేయర్ శ్రీధర్ పాల్గొని పూజలు చేశారు.


సుసర్ల కాలనీ చంద్రమౌళీశ్వరాలయంలో జ్వాలాతోరణం



అవార్డు సాధించిన విశాఖ నేవల్ డాక్‌యార్డు ఉద్యోగులు

ఆర్ఐఎన్ఎల్‌కు, నేవల్ డాక్ యార్డుకు గోల్డ్ అవార్డులు

ఇంటర్నేషనల్ కన్వెన్షన్స్ ఆన్ క్వాలిటీ కంట్రోల్ సర్కిల్స్-2024 (ఐసీక్యూసీసీ) పేరుతో కొలంబోలో నాలుగు రోజులు నిర్వహించిన సదస్సులో ఆర్ఐఎన్ఎల్‌కు మూడు గోల్డ్ అవార్డులు, విశాఖ నేవల్ డాక్‌యార్డు ఒక గోల్డ్ అవార్డు సాధించాయి.


అవార్డులు సాధించిన ఆర్ఐఎన్ఎల్ ఉద్యోగులు

రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- పంచాయతీరాజ్ శాఖ అడిషనల్ కమిషనర్ శివప్రసాద్


సరిపల్లిలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న పీఆర్ అడిషనల్ కమిషనర్ శివప్రసాద్

పెందుర్తి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి నిధులతో పంచాయతీల్లో చేపడుతున్న సీసీ రోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించి, పనులను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ శాఖ అడిషనల్ కమిషనర్ శివప్రసాద్ ఆదేశించారు. శుక్ర వారం ఆయన సరిపల్లి, రాంపురం, పెదగాడి, జంగాలిపాలెం గ్రామాల్లో సీసీ రోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో శంకుస్థాపన చేసిన పనులను ఇప్పటికీ ప్రారంభించకపోతే రద్దు చేస్తామని, అందుకు అధికారులు బాధ్యత వహించాలన్నారు. ఉపాధి నిధులతో జరిగే పనుల్లో అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఉపాధి సిబ్బంది ఎప్పకప్పుడు క్షేత్రస్థాయి పరిశీలన చేసి, నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం ఆయన పెందుర్తిలోని జిల్లా మహిళా సమాఖ్య భవనంలో ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీరాజ్ శాఖాధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొని, మాట్లాడారు. పల్లె పండుగ కార్యక్రమంలో మంజూరైన నిధులతో అన్ని చోట్లా సీసీ రోడ్లు, కాలువలు పూర్తి చేయాలన్నారు.

మెరైన్ డీఐజీ ఆకస్మిక సందర్శన


రుషికొండ బీచ్‌లో మెరైన్ పోలీసులతో మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్‌జెట్టి

సాగర్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్, మెరైన్ పోలీస్ స్టేషన్‌ను ఆ విభాగం డీఐజీ గోపీనాథ్‌జెట్టితో పాటు మెరైన్ ఎస్పీ రవివర్మ, డీఎస్పీ బాలరాజు శుక్రవారం సందర్శించారు. డీఐజీ తొలుత మెరైన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, సిబ్బంది పని తీరు పై ఆరా తీశారు. అక్కడ నుంచి రుషికొండ బీచ్‌కు వెళ్లి సందర్శకుల భద్రతకు తీసుకుంటున్న చర్యలను సీఐ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్పీడ్ బోటు ఎక్కి సముద్రంలో కొద్ది దూరం ప్రయాణించారు. సందర్శకుల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రమాద సంకేతాలను ఎప్పటికప్పుడు వివరిస్తూ, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం బీచ్‌లో విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డులు, కమ్యూనిటీ గార్డులతో మాట్లాడారు.

చిన్నారి అపహరణకు యత్నించిన మహిళల కోసం గాలింపు

గాజువాక, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) :గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చిన్నారిని అపహరించేందుకు ప్రయత్నించిన కేసులో పరారైన ఇద్దరు మహిళల కోసం గాజువాక పోలీసులు గాలిస్తున్నారు. స్థానికంగా సీసీ కెమెరాలు అందుబాటులో లేకపోవటంతో పోలీసులు అందుబాటులో ఉన్న సాంకేతిక టెక్నాలజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

సినీ నటుడు కృష్ణకు నివాళి

పెదగంట్యాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చలనచిత్ర నటుడు, సూపర్ స్టార్ కృష్ణ ద్వితీయ వర్ధంతిని జీవీఎంసీ 75వ వార్డు సీతానగరంలోని ఎన్టీఆర్ సెంటర్‌లో నిర్వహించారు.కృష్ణ, మహేష్‌బాబు అభిమాన సంఘం ఆధ్వర్యంలో పలువురు కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు నమ్మి అప్పారావు, నమ్మి అప్పలనాయుడు మాట్లాడుతూ కృష్ణ వివిధ రూపాల్లో పేదలకు చేసిన సాయం, బాధితులకు అండగా నిలిచిన విధానం వివరించారు. కార్యక్రమంలో మొల్లి నూకరాజు, నంబారు కనకరాజు, మెల్లి ఈశ్వరరావు, ఎన్.వెంకటఅప్పారావు, మొల్లి రమణబాబు పాల్గొన్నారు.

చెరువు మెట్ల నిర్మాణానికి శంకుస్థాపన

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నాతయ్యపాలెం కృష్ణమహంతి చెరువులో మెట్ల నిర్మాణానికి శుక్రవారం 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి భూమి పూజ చేశారు. కార్తీక మాస దీపోత్సవంతో పాటు ఇతర పూజాకార్యక్రమాలలో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం స్థానిక నాయకులు కె.వెంకట్ ఆర్థిక సహాయంతో నిర్మించనున్న ఈ చెరువు మెట్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్ దంపతులను కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డితో పాటు స్థానిక నాయకులు సి.సోమునాయుడు, సంగ్రాన చిన సన్యాసిరావు తదితరులు అభినందించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

మల్కాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పుస్తక పఠనం వల్ల విజ్ఞానం పెరుగుతుందని ములగాడ ఎంఈఓ వెంకట్రావు అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదిలో చదివే పుస్తకాలు వల్ల మార్కులు వస్తాయని, అదే గ్రంథాలయంలో చదివే పుస్తకాలు వల్ల సామాజిక బాధ్యత పెరుగుతుందని చెప్పారు. ప్రతి విద్యార్థి నైపుణ్యాలను పెంచుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపీఎస్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ స్వీయ క్రమ శిక్షణ, పుస్తక పఠనం, సామాజిక సేవ, వ్యక్తులను ఉన్నతంగా తీర్చి దిద్దుతాయన్నారు. అనంతరం ఎంఈఓ వెంకట్రావును గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్, రచయిత సత్తిరాజు, భాగ్యలక్ష్మి సన్మానించారు. అంతకుముందు స్వచ్ఛభారత్ అన్న అంశంపై విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

గోపాలపట్నంలో..

గోపాలపట్నం : గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను గోపాలపట్నం క్రైం ఎస్ఐ రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని, దీనివల్ల విజ్ఞానం లభిస్తుందని చెప్పారు. గ్రంథాలయాధికారి నరసింహం మాట్లాడుతూ గ్రంథాలయంలో ప్రస్తుతం 10 వేలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం ఎస్ఐను గ్రంథాయ అభివృద్ధి కమిటీ సభ్యులు సత్కరించారు.

గిరిజనుల ఉన్నతికి బిర్సా ముండా కృషి

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల అభ్యున్నతి కోసం అహర్నిశలు పోరాడిన ఘనత బిర్సా ముండాకే దక్కిందని భెల్ హెచ్‌పీవీపీ ఏజీఎం ఎస్.లీల అన్నారు. భెల్ హెచ్‌పీవీపీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం భెల్ టౌన్‌షిప్‌లో బిర్సా ముండా 149వ జయంతి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కొల్లి దేముడు, ఎస్.సాహు, బి.బాబురావు, పీవీఎన్ రాజు, జీటీపీ ప్రకాష్, టెక్కలి భాస్కరరావు, బి.రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంపై నేడు అవగాహన ర్యాలీ

పెందుర్తి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అవయవ దానంపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్టు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీను తెలిపారు, శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వెయ్యి మందితో ర్యాలీ జరుగుతుందని, అనంతరం స్థానిక శాంతికల్యాణ మండపంలో సదస్సు ఉంటుందన్నారు. జీవన్‌దాన్ కో ఆర్డినేటర్ కె. రాంబాబు, కేజీహెచ్ పర్యవేక్షణాధికారి శివానంద్, అఖిల భారత అవయవ దాతల సంఘం గౌరవాధ్యక్షుడు సీతామహాలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్టు చెప్పారు.

పారిశుధ్యం నిర్వహణపై సమీక్ష

ఎన్ఏడీ జంక్షన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 90, 91 వార్డులకు సంబంధించి పారిశుధ్య నిర్వహణపై ఆయా సచివాలయాల శానిటేషన్ అధికారులు, సిబ్బందితో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు బొమ్మడి రమణ, జెడ్సీ హైమావతి శుక్రవారం ససర్లకాలనీ సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులో పారిశుధ్యం మెరుగుకు అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారిని వేరేచోటకు మార్చాలని, దీని వల్ల పారిశుధ్య మెరుగుపడే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో ఏఎంహెచ్‌ఓ బండారు అప్పలనాయుడు, శానిటరి సూపర్‌వైజర్ రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బుచ్చిబాబు, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యంతో బాలిక మృతి ?

మల్కాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆర్ఎంపీ వైద్యుడి నిర్వాకం వల్ల ఏడాది బాలిక మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. త్రినాథ్‌పురం ప్రాంతానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు బాలికకు చేయి కాలడంతో చికిత్స అందించారు. వైద్యుడు పూర్తిగా పరీక్షించుకుండానే మందులు ఇచ్చారని, మందులు వాడిన నాలుగు రోజుల తరువాత ఆమెకు అనారోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తి మృతి చెందిందని బాలిక కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈమేరకు వారు వైద్యుడ్ని నిలదీయగా, తనకేమీ సంబంధం లేదని, అసలు వైద్యమే చేయలేదని చెప్పడంతో బాధితులు మల్కాపురం పోలీసులను ఆశ్రయించారు. కాగా బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం చేయాల్సి ఉందని పోలీసులు చెప్పగా బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడానికి నిరాకరించినట్టు తెలిసింది. కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు బాలిక తల్లిదండ్రులను, వైద్యుడ్ని కూర్చొబెట్టి రాజీ కుదిర్చినట్టు సమాచారం.

నిందితుడి కోసం గాలింపు

గాజువాక, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పెదగంట్యాడ ప్రాంతంలో యువతిపై రాడ్డుతో దాడి చేసిన వ్యక్తి కోసం న్యూపోర్టు పోలీసులు గాలిస్తున్నారు. దాడిలో గాయపడిన మేఘన గాజువాకలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ దాడికి పాల్పడిన జమ్ము కశ్మీర్ ప్రాంతానికి చెందిన నీరజ్‌శర్మను పట్టుకునేందుకు హర్బర్ ఏసీపీ ఎస్.కాళీదాసు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు.

అవగాహన లోపం... వేసెక్టమీకి దూరం!

కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సకు ముందుకు రాని పురుషులు

- అందుబాటులో కుట్టు, కోత లేని అధునాతన శస్త్రచికిత్స
- మహిళలతో పోలిస్తే అత్యంత సులభం
- అరగంటలోనే అన్ని పనులు చేసుకునే అవకాశం
- విస్తృత ప్రచారంతోనే ఫలితాలు

నేడు ప్రపంచ వేసెక్టమీ డే



విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):

పురుషులకు చేసే కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సను వేసెక్టమీ అని పిలుస్తారు. మహిళలకు ట్యూబెక్టమీ చేస్తారు. వారితో పోలిస్తే వేసెక్టమీ అత్యంత సులభం కావడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. కానీ ఇందుకోసం పురుషులు ముందుకు రావడం లేదు. అవగాహన లోపం.. అపోహలతో దూరమవుతున్నారు. ఈ ఆపరేషన్‌పై పురుషుల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏటా నవంబరు 17న ప్రపంచ వేసెక్టమీ డే నిర్వహిస్తున్నారు.

పిల్లలు వద్దనుకునే దంపతుల్లో ఒకరు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సను చేయించుకోవాలి. పురుషులకు వేసెక్టమీ, మహిళలకు ట్యూబెక్టమీ చేయడం ద్వారా ఇది సాధ్యమవుతుంది. దేశంలో ఏళ్లుగా వేసెక్టమీ ఆపరేషన్లను నిర్వహిస్తున్నప్పటికీ పురుషులు స్వచ్ఛందంగా ముందుకు రావడం లేదు. ఈ శస్త్రచికిత్స బాధ్యత మహిళలదే అన్న భావన విస్తృతంగా వ్యాపించింది. ఇప్పటికీ వంద కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహిస్తే అందులో 95 శాతం మహిళలు కాగా, కేవలం ఐదు శాతం మంది మాత్రమే పురుషులుంటున్నారు.

కోత, కుట్టు లేని ఆపరేషన్..

ఈ ఆపరేషన్ అధునాతన ఎన్ఎస్‌వీ (నో స్కాల్‌పెల్ వ్యాసెక్టమీ) పద్ధతిలో చేస్తున్నారు. ఇందులో కోత, కుట్టు లేకుండా బటన్ సైజు రంధ్రం పెట్టడం ద్వారా పూర్తి చేస్తున్నారు. ఈ విధానంలో రక్తస్రావం, కోత, కుట్టు, కట్టు లాంటివేవీ ఉండవు. ఆపరేషన్ కొద్ది నిమిషాల్లోనే పూర్తవుతుంది. ఆ తరువాత అర్ధ గంటలోనే ఇంటికి వెళ్లిపోవచ్చు. విశ్రాంతి తీసుకోవాల్సిన అవసరం కూడా లేదు. వేసెక్టమీ ఆపరేషన్‌లో వృషణాల నుంచి శుక్ర కణాలను పురీషనాళం ద్వారా తీసుకువెళ్లే గొట్టం (వేస్)ని కట్ చేసి సెమినల్ వెసికల్స్‌కు వెళ్లకుండా చేస్తారు. ఇది శాశ్వత కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స. మహిళల్లో అయితే డబుల్ పంక్చర్ లాప్రోస్కోపిక్ విధానంలో శస్త్రచికిత్స చేస్తారు. ఇది కూడా అధునాత ప్రక్రియ.

ఆపరేషన్‌కు ప్రోత్సాహకం..

కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకునే వారికి ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందిస్తు న్నాయి. పేదవర్గాల వారు ట్యూబెక్టమీ చేయించు కుంటే రూ.650 (బీపీఎల్), వేసెక్టమీ చేయించుకుంటే రూ.1,100 చొప్పున ఆర్థిక సాయం ఇస్తారు. అయినప్పటికీ పురుషులు ముందుకు రావడం లేదు.

అపోహలతోనే దూరం..

వేసెక్టమీ ఆపరేషన్లు తక్కువగా జరగడానికి ప్రధాన కారణం పురుషుల్లో అపోహలే. ఆపరేషన్ తరువాత గట్టి పనులు చేయలేమన్న భావన, సెక్స్ సామర్థ్యం తగ్గుతుం దన్న అపోహ, శారీరకంగా బలహీనపడతారనే అనుమానం తో ముందుకు రావడం లేదు. పురుషులను ఆపరేషన్లకు దూరంగా ఉండమని మహిళలే సూచిస్తున్నారని వైద్యులు చెబుతుండడం గమనార్హం.

వ్యత్యాసం ఎక్కువే..

వేసెక్టమీ చేయించుకునేందుకు పురుషులు ముందుకు రాకపోవడంతో మహిళలే ట్యూబెక్టమీ చేయించుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. పిల్లలు వద్దనుకునే వారు దానికి ముందు జరిగే ప్రసవం సమయంలోనే ట్యూబెక్టమీ చేయిం చేస్తున్నారు. దీంతో పురుషులకు ఆశించినస్థాయిలో ఆపరేన్లు జరగడం లేదు. ఇదిలా ఉంటే జిల్లాలో కేజీహెచ్‌తోపాటు మరో రెండు, మూడు చోట్ల మాత్రమే కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేస్తున్నారు. అదే సమయంలో దీనిపై అవ గాహన కల్పించే ప్రయత్నాలు చేయకపోవడం కారణంగా చెబుతున్నారు.

వ.స	సంవత్సరం	వేసెక్టమీ	ట్యూబెక్టమీ
1.	2021-22	250	6841
2.	2021-22	274	7715
3.	2022-23	57	5263
4.	2023-24	76	5486
5.	2024-25	30	2742

అపోహలు విడనాడాలి



పురుషులకు చేసే వేసెక్టమీ ఆపరేషన్ అత్యంత సులభం. చాలామంది అపోహలతోనే దూరంగా ఉంటున్నారు. కుట్టు, కోత లేకుండా క్షణాల్లో చేయడంతో పాటు అర్ధ గంటలో ఇంటికి వెళ్లి పనులు చేసుకోవచ్చు. వెన్ను నొప్పి, బరువు పనులు చేయలేమన్న భావనతోపాటు ఇతర అపో హలు వీడాలి. ఇప్పటి వరకు సుమారు 50 వేలు ఆపరేషన్లు చేశాను. ప్రతి ఒక్కరూ ఇలాంటి సందే హాలను వ్యక్తం చేస్తున్నారు. ఆపరేషన్ తరువాత అయిపోయిందా అని ఆశ్చర్యపోతుంటారు.

- డాక్టర్ డి.యుగంధర్, జనరల్ సర్జరీ విభాగం, కేజీహెచ్

వరాహ పుష్కరిణికి నదీ హారతి



పుష్కరిణి ఒడ్డున దీపాలు వెలిగిస్తున్న మహిళలు



వరాహ పుష్కరిణికి హారతి ఇస్తున్న పండితులు, పాల్గొన్న భక్తులు

సింహాచలం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భక్తుల ఆనందోత్సాహాల మధ్య శుక్రవారం వరాహ పుష్కరిణిలో పుణ్యనదీ హారతిని నిర్వహించారు. ఏటా కార్తీక పౌర్ణమి సందర్భంగా నదీహారతి నిర్వహించడం సంప్రదాయం. ఇందులో భాగంగా సాయంత్రం కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి స్వామి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా వరాహ పుష్కరిణికి తీసుకువచ్చారు. స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు, వెంకటరమణాచార్యులు, పురోహితులు కరి సీతారామాచార్యులు షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం ఏక, ద్వయ, సప్త, కుంభ, నక్షత్ర తదితర దశ హారతులను పుష్కరిణిలోని గంగకు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు దేవస్థానం అందజేసిన స్వదేశీ గోమయంతో తయారుచేసిన ప్రమిదలలో దీపాలు వెలిగించారు. కళాకారులు శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, కోలాటాలు ప్రదర్శించారు. ఉత్సవంలో ఈవో వేంద్ర త్రినాథరావు, అడిషినల్ సీపీ రాజేంద్ర దీపాలు వెలిగించి హారతులిచ్చారు. కార్యక్రమంలో ఈఈ డీజీ శ్రీనివాసరాజు, ఏఈఓలు, పర్యవేక్షణాధికారులు, భక్తులు పాల్గొన్నారు. ఉత్సవం సందర్భంగా పుష్కరిణి పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

జ్ఞాన లింగేశ్వరాలయంలో వైభవంగా జ్వాలా తోరణం

వెంకోజీపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా కొత్త వెంకోజీపాలెం గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో శుక్రవారం జ్వాలాతోరణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. స్వామికి తెల్లవారుజాము నుంచి విశేష పూజలు, అభిషేకాలు బిల్వార్చనలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు. సెంచూరియన్ లా వర్సిటీ వీసీ జీఎస్ఎన్.రాజు తదితరులు జ్వాలా తోరణాన్ని వెలిగించారు. శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి భక్తులంతా మూడుసార్లు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి, అనంతరం జ్వాలా తోరణం కింద మూడుసార్లు తిరిగారు. జ్వాలాతోరణం నుంచి మిగిలిన బూడిదను బొట్టుగా ధరించారు. గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు పీల కనకరాజు పీల నాగేశ్వరరావు, మద్దాల వీరవెంకట అప్పారావు, ఆడారి కామేశ్వరరావు, ఆడారి శ్రీనివాస్, ఎస్.నరసింహారెడ్డి, బోర రమణారెడ్డి, ఎర్రాజీరెడ్డి, మద్దాల నరసింహారావు, మహిళా మండలి సభ్యులు పూజలు చేశారు. ఈవో బండారు ప్రసాద్, రాంబాబు, రామాంజనేయులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



జ్వాలా తోరణం సందర్భంగా భక్తులకు హారతి ఇస్తున్న జ్ఞానలింగేశ్వరాలయ అర్చకులు

జ్వాలా తోరణం ప్రత్యేకత...

జ్వాలా తోరణం ఏర్పాటు వెనుక పురాణ గాథ ప్రాచుర్యంలో ఉంది. అమృతం కోసం దేవతలు, రాక్షసులు క్షీర సాగరాన్ని మదించగా ముందు హాలాహలం వెలువడింది. సమస్త విశ్వాన్నీ అది నాశనం చేస్తుందని, కాపాడాలని దేవతలంతా పరమేశ్వరుడిని శరణు వేడుకుంటారు. దీంతో శివుడు విషాన్ని తాగి తన గరళంలో ఉంచాడు. అది చూసి భయపడిన పార్వతీదేవి విషం వల్ల తన భర్తకు ఎలాంటి హాని కలగకూడదని భావించి, నివారణ కోసం జ్వాల కింది నుంచి వెళ్తానని మొక్కుకున్నట్టు పురాణ కథ. అలా పార్వతీదేవి కార్తీక పౌర్ణమి రోజున జ్వాలాతోరణం కింద నుంచి వెళ్లడంతో శివుడికి విషప్రభావం తొలగిపోయిందని, అప్పటి నుంచి ఏటా జ్వాలా తోరణం వెలిగించి, భక్తిశ్రద్ధలతో దాని కిందనుంచి వెళ్లడం ఆనవాయితీగా మారిందని ప్రతీతి. శివాలయం ఎదుట రెండు కర్రలు నిలువుగా ఉంచి, దానికి అడ్డంగా మరో కర్రను కట్టి కొత్త గడ్డిని చుడతారు. దానిపై నెయ్యి వేసి వెలిగిస్తారు. దీనినే జ్వాలా తోరణం, లేదా యమద్వారం అని పిలుస్తారు. పార్వతీ పరమేశ్వరులను పల్లకిలో ఉంచి తోరణం కింద మూడుసార్లు ఇరువైపులా తిప్పుతారు. ఈ పల్లకి వెనుక నడిస్తే శుభం చేకూరుతుందని భక్తుల విశ్వాసం.

సికింద్రాబాద్-లక్నో ప్రత్యేక రైలు రద్దు

విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక కారణాలతో దువ్వాడ మీదుగా సికింద్రాబాద్, లక్నో మధ్య ప్రవేశపెట్టిన ప్రత్యేక రైలు సర్వీసులో ఒక ట్రిప్పును రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 22న 07084 నం బరుగల ప్రత్యేక రైలు, తిరుగు ప్రయాణంలో 07083 నంబరు గల లక్నో-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 25న అందుబాటులో ఉండదని పేర్కొన్నారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

అభివృద్ధి ప్రాజెక్టులపై అధికారులతో కలెక్టర్ సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపట్టదలచిన అభివృద్ధి ప్రాజెక్టులు, భవిష్యత్ కార్యాచరణపై కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగు ణంగా పర్యాటకం, పచ్చదనానికి పెద్దపీట వేస్తూ కార్యాచరణ ప్రణాళిక రూపొందిం చాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నగర సౌందర్యం ఇనుమడించేలా విభిన్నజాతుల మొక్కల పెంపకం చేపట్టాలని, ఇందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ పరిధిలో చేపట్టాల్సిన ప్రాజెక్టులపై కలెక్టర్ సమీక్షించారు. నగరాన్ని అనుసంధానించే ప్రధాన రహదారులపై దృష్టి సారిస్తూ, అభివృద్ధికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని, పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరారు. నగరంలో తాగునీటి సరఫరా, వీధిదీపాల స్థితిగతులపై సమీక్షించారు. టిడ్కోలో తిరస్కరణకు గురైన దరఖాస్తులను మరోసారి పరిశీలించాలని సూచించారు. సమస్యలపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల పురోగతిపై కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ప్రశ్నించారు. ఈ సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, వీఎమ్‌ఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, డీఆర్‌ఓ భవానీ శంకర్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

'పన్ను చెల్లింపుదారుల సహకారం అవసరం'



మాట్లాడుతున్న జీఎస్టీ కమిషనర్ ఆనంద్ కుమార్

విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పన్ను చెల్లింపుదారుల సహకారంతోనే పారదర్శకత సాధ్యమవుతుందని జీఎస్టీ కమిషనర్ పి.ఆనందకుమార్ అన్నారు. ఫ్యాప్సీ ఆధ్వర్యంలో దసపల్లా హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో కీలకోపన్యాసం చేశారు. సమర్థ పన్నుల విధానానికి ఆడిటింగ్ కీలకమన్నారు. పన్ను చెల్లింపుదారుల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. సమావేశానికి ఫ్యాప్సీ అధ్యక్షుడు కంకటాల మల్లిక్ అధ్యక్షత వహించగా, ఫౌండర్ రామకృష్ణ సంగు తదితరులు ప్రసంగించారు.

మూర్ఛ వ్యాధిపై అపోహలు విడనాడాలి

- ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ బుచ్చిరాజు

విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మూర్ఛ వ్యాధిపై అపోహలు, అనుమానాలను నివృత్తి చేసుకోవాలని ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు పేర్కొన్నారు. నేషనల్ ఎపి లెప్సీ డే సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఏటా వారోత్సవాలు నిర్వహిస్తు న్నట్టు వివరించారు. రెండుశాతం మందిలో సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. మేజర్, మైనర్ వ్యాధులున్నాయని, 90 శాతం నయం చేయవచ్చన్నారు. నివారణకు 30 రకాల మం దులు అందుబాటులో ఉన్నాయన్నారు. కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రవి మాట్లాడుతూ వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స ఇవ్వడం కీలకమన్నారు. ఎండోక్రైనా లజీ విభాగాధిపతి డాక్టర్ కేపీవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వ్యాధి నివారణకు అవగాహన అవసరమన్నారు. కేజీహెచ్ న్యూరాలజీ విభా గాధిపతి డాక్టర్ ఎస్.గోపి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 12 కోట్ల మంది, దేశంలో 70 మిలియన్‌ల మంది మూర్ఛవ్యాధితో బాధపడు తున్నారన్నారు. సమావేశం లో డాక్టర్ ప్రేమ్‌జిత్‌రే, డాక్టర్ టి.సతీష్‌కుమార్, డాక్టర్ సీహె చ్ సుష్మ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈవోగా సోమేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



సోమేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎంఈవో దివాకర్, ఉపాధ్యాయులు

కంచరపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపవిద్యాశాఖాధికారిగా గోపాలపట్టణం మండల విద్యాశాఖాధికారి అంబటి సోమేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సోమేశ్వరరావును పూర్తి అదనపు బాధ్యతలతో డిప్యూటీ డీఈవోగా నియమిస్తూ విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు డీఈవో సమక్షంలో విధుల్లో చేశారు. ఎంఈవోలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య

వేపగుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన వేపగుంట ఎస్సీ కాలనీలో శుక్రవారం జరిగింది. విషయం తెలుసుకున్న భర్త పెట్రోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పలుకూరి విజయలక్ష్మి (37), భర్త నాగరాజు కంచరపాలెం నుంచి వచ్చి కాలనీలో ఉంటున్నారు.నాగరాజు తోపుడు బండిపై పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. వారికి అప్పులున్నాయి. ఈ విషయమై గురువారం రాత్రి దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో విజయలక్ష్మి శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. నాగరాజు పెట్రోల్ తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు కేజీహెచ్‌కు తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్‌లో మల్కాపురం యువకుడి మృతి



దేవ్ (ఫైల్ ఫొటో)

మల్కాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మల్కాపురం వాసి మృతిచెందాడు. ఈ సంఘటన హైదరాబాద్ గచ్చిబౌలిలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. స్థానిక ఎస్సీకాలనీకి చెందిన పిల్లి దేవ్‌కుమార్‌స్వామి అలియాస్ చిన్న(25) హైదరాబాద్‌లో అమెజాన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. తన స్నేహితుడు జీడిమెట్లకు చెందిన వెంకటస్వామి (30)తో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తూ విప్రో సర్కిల్‌వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరూ మృతిచెందారు. చిన్న మేనమామ సమాచారంతో తల్లిదండ్రులు కనకమహాలక్ష్మి, కుమార్‌స్వామి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని శనివారం మల్కాపురం తీసుకురానున్నారు. స్థానిక పోలీసులకు సమాచారం అందింది.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు కేరళ వాసుల అరెస్టు

విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ నుంచి గుట్టుగా తీసుకొచ్చిన గంజాయిని కేరళ తరలిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ విభాగం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. కేరళలోని త్రివేండ్రంకు చెందిన వీకే అభిషేక్, కొట్టాయంకు చెందిన ఎంఎం సచిన్ ఏడు కేజీలు గంజాయిని రెండు ప్యాకెట్లుగా బ్యాగులో పెట్టుకుని కేరళ వెళ్లేందుకు రామాటాకీస్ వద్ద ఉండగా, టాస్క్‌ఫోర్స్ ఏసీ సీహెచ్‌వీ మహేష్‌కుమార్‌కు సమాచారం అందింది.సీఐ శ్రీనివాసరావు సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నారు సీతమ్మధారలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.

రోడ్డుపై ఇద్దరు చిరు వ్యాపారుల కొట్లాట



కొట్టుకుంటున్న మహిళలు

గాజువాక, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్‌లో ఇద్దరు చిరు వ్యాపారులు రెచ్చిపోయారు. మహిళల మధ్య శుక్రవారం ఉదయం వ్యాపార స్థలం విషయంలో వివాదం మొదలై దాడికి దారితీసింది. వీరిని విడిపించేందుకు అక్కడ ఉన్న కొంత మంది వ్యక్తులు ప్రయత్నించినప్పటికీ చాలాసేపటి వరకు జు ట్టు పట్టుకుని కొట్లాడుతూనే ఉన్నారు. వారికి సంబంధించిన పురుషులు కూడా ఈ వివాదం లో రోడ్డుపైనే గట్టిగా కొట్టుకున్నారు.

రియల్ వ్యాపారిపై దాడి: నిందితుల కోసం గాలింపు

ఎండాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ లావాదేవీల్లో వివాదం రేగి ఒక వ్యక్తిపై నలుగురు దాడి చేశారు. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పీఎం పాలెంలో ఉంటున్న వోరే చంద్రశేఖర్ (46) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. అతనికి మరో వ్యాపారి పేరూరి సోమశేఖర్‌తో పరిచయం ఉంది. ఇటీవల వ్యాపారంలో వారి మధ్య గొడవ జరిగింది. డబ్బు కోసం సింహాద్రిరావు అనే వ్యక్తిని సోమశేఖర్ వేధిస్తుండడంతో చంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు గురువారం రాత్రి చంద్రశేఖర్ తన ఇంటికి నడిచి వెళ్తుండగా వెనుక నుంచి కారులో సోమశేఖర్, ఆయన భార్య మహాలక్ష్మి వచ్చి తమను చంద్రశేఖర్ కొట్టి, లైంగిక దాడికి పాల్పడ్డాడని నమ్మించడంతో స్థానికులు చంద్రశేఖర్‌ను చెట్టుకి కట్టేశారు. ఈ క్రమంలో సోమశేఖర్, అతని భార్య, మరో ఇద్దరు చంద్రశేఖర్‌పై దాడి చేశారు. కొద్దిసేపటి తరువాత స్థానికులు విషయం తెలుసుకుని చంద్రశేఖర్‌ను కేజీహెచ్‌కి తరలించారు. పోలీసులు గాయపరిచిన నలుగురి కోసం గాలిస్తున్నారు.

19న స్కూల్ గేమ్స్ థాంగ్ టా, బీచ్ వాలీబాల్ పోటీలు

విశాఖపట్నం స్పోర్ట్సు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ అండర్-14, 17 జిల్లా స్థాయి థాంగ్ టా, బీచ్ వాలీబాల్ పోటీలు కమ్ జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్టు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి దేవుడు తెలిపారు. ఈ నెల 19న పాడేరు తలార్‌సింగ్‌లోని జీటీడబ్ల్యుఏ స్కూల్‌లో థాంగ్ టా, ఆర్కే బీచ్‌లో బీచ్ వాలీబాల్ జట్టు ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు థాంగ్ టా గేమ్‌కు సంబంధించి ఫోన్: 94411 05964, బీచ్ వాలీబాల్ కోసం ఫోన్:98858 68988లలో సంప్రదించాలన్నారు.

ఆరునెలల్లో గురుకుల పాఠశాల భవనాలు పూర్తి

- భీమిలి ఎమ్మెల్యే గంటాకు మంత్రి లోకేశ్ హామీ

భీమునిపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సింహాచలం మహాత్మా జ్యోతిబా పూలే బీసీ రెసిడెన్షియల్ కళాశాలలో అసంపూర్తి భవన నిర్మాణాలను ఆరునెలల్లో పూర్తిచేస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో శుక్రవారం నియోజకవర్గంలోని కాలేజీలు, మౌలిక సదుపాయాలపై ఎమ్మెల్యే గంటా అడిగిన ప్రశ్నకు లోకేశ్ సమాధాన మిస్తూ ఆరునెలల్లో పూర్తి చేసి మీతోనే ప్రారంభోత్సవం చేయిస్తామన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ అప్పట్లో ఎన్టీఆర్ ప్రారంభించిన విద్యాలయమని మంత్రికి గుర్తుచేశారు. తగరపువలస డిగ్రీ కాలేజీకి భవనం లేకపోవడంతో కేజీబీవీ హాస్టల్‌లోని నాలుగు గదుల్లో డిగ్రీ విద్యార్థులకు బోధన జరుగుతోందని, వచ్చే మార్చి నుంచి గదులు ఖాళీ చేయాలని కేజీబీవీ అధికారులు ఆదేశించారని ఎమ్మెల్యే ప్రస్తావించగా వసతి సమస్య లేకుండాచూడాలని అధికారులను ఆదేశిస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు.

ఆర్టీసీ అప్రంటీస్‌షిప్ అభ్యర్థులకు ప్రాక్టికల్స్



మెకానికల్ ప్రాక్టికల్ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

ద్వారకాబస్‌స్టేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని వివిధ డిపోల్లో అప్రంటీస్‌షిప్ పూర్తి చేసుకున్న 63 మంది అభ్యర్థులకు శుక్రవారం వాల్తేరు డిపోలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. జోన్-1 డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కె.రాజశేఖర్, మద్దిలపాలెం డిపో మేనేజర్ ఎన్.అరుణకుమారి, సంచాలకులుగా, గాజువాక, వాల్తేరు డిపో మేనేజర్లు పరిశీలకులుగా వ్యవహరించారు. అనంతరం ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూలు చేశారు.

పోర్టులో నేవిక్ 21పై కీలక సమావేశం

విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సముద్ర వ్యాపారానికి సంబంధించి భవిష్యత్తు కార్యాచరణ, నౌకాయానంలో సమగ్ర విధానాలు, ప్రామాణికాలు రూపొందించడానికి ఉద్దేశించిన నేవిక్ 21 పై విశాఖపట్నం పోర్టులో శుక్రవారం కీలక సమావేశం నిర్వహించారు. రైల్వే, హోమ్, అటవీ, పర్యావరణ, రహదారులు, భవనాల శాఖల అధికారులు పాల్గొన్న ఈ సదస్సుకు పోర్టు చైర్మన్ అంగముత్తు అధ్యక్షత వహించి ప్రసంగించారు. నౌకాయాన రంగంలో పురోగతిని సమగ్రంగా, ప్రామాణికంగా నిర్దేశించడానికి ఈ సెల్‌ను ఏర్పాటు చేశారని వివరించారు. పునరుత్పాదక శక్తి, సంబంధిత శాఖల విధానాలు, నూతన చట్టాలపై చర్చించారు. ప్రస్తుత సవాళ్లను అంచనా వేసి, వాటికి సరైన పరిష్కారాలను సూచించడమే లక్ష్యమన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోర్టు చైర్మన్ అంగముత్తు